జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 25, జనవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం


- దావోస్ చర్చలతో త్వరలో రాష్ట్రానికి దిగ్గజ సంస్థల సీఈఓలు, ప్రతినిధులు
- పెట్టుబడుల చర్చలు కార్యరూపం దాల్చేలా ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సీఎం ఆదేశం



## దావోస్ ప్రతిపాదనలపై చంద్రబాబు ఫోకస్

**అమరావతి:** దావోస్ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయా సంస్థలతో జరిగిన చర్చలు, ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడంపై దృష్టి పెట్టారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకన్న చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఎంఓ అధికారులతో దావోస్ పర్యటనపై చర్చించారు.

మూడురోజుల పాటు ఆయా కంపెనీల సీఈఓలు, ఛైర్మన్‌లు, ప్రతినిధులతో వివిధ రంగాల్లో పెట్టుబడులపై జరిపిన చర్చలను అధికారులకు వివరించారు. మౌలిక మిగతా.. 2లో

● ఫ్యాను ఉక్కిరిబిక్కిరి

### బీజేపీలోకి వైసీపీ ఎంపీ


# అయోధ్య రామిరెడ్డి?

- వచ్చే వారం వైసీపీ ఎంపీ పదవి, పార్టీకి రాజీనామా?
- మళ్లీ ఆ సీటు అయోధ్యకేనా?
- బీజేపీలో కృష్ణయ్య ఫార్ములా అమలు?
- వైసీపీకి రాజ్యసభలో తగ్గుతున్న బలం
- ఇప్పటికే మోపిదేవి, కృష్ణయ్య, బీద రాజీనామాలు
- తాజాగా విజయసాయిరెడ్డి రాజీనామా
- తర్వాత వరసలో గొల్ల బాబూరావు, పరిమళ్ నత్వానీ?



(మార్తి సుబ్రహ్మణ్యం)

వైసీపీ రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త అయోధ్యరామిరెడ్డి పార్టీకి, తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి, బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న అయోధ్య రామిరెడ్డి వచ్చే వారం స్వదేశానికి వచ్చిన తర్వాత, రాజ్యసభ చైర్మన్‌ను కలసి తన రాజీనామా సమర్పిస్తారన్న ప్రచారం జరుగుతోంది.





కాగా అయోధ్య రామిరెడ్డి విషయంలో బీజేపీ.. ఆర్.కృష్ణయ్య ఫార్ములానే తిరిగి కొనసాగించే అవకాశాలు కనిపిస్తున్నాయని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ రాజ్యసభ సభ్యుడయిన ఆర్.కృష్ణయ్య, తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అయితే తిరిగి తన సీటు తనకే ఇవ్వాలన్న షరతుపైనే ఆయన రాజీనామా చేశారు. చెప్పినట్లుగానే బీజేపీ నాయకత్వం, ఆయన పార్టీలో చేరిన రోజునే.. ఒక చేత్తో పార్టీ సభ్యత్వం, మరో చేతితో బిఫారం ఇచ్చిన విషయం తెలిసిందే.

అటు వైసీపీ మరో ఎంపీ బీద మస్తాన్‌రావు కూడా ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన సీటు తనకే ఇవ్వాలన్న షరతుతోనే ఆయన రాజీనామా చేసి, తిరిగి టీడీపీ టికెట్‌పై రాజ్యసభలో అడుగుపెట్టారు. మరోవైపు వైసీపీ ఎంపి మోపిదేవి వెంకటరమణతో సానా సతీష్ మాట్లాడుకుని, ఆయనతో రాజీనామా చేయించుకుని.. ఖాళీ అయిన మోపిదేవి సీటును సతీష్ తీసుకున్న విషయం తెలిసిందే.

త్వరలో వైసీపీ ఎమ్మెల్సీల రాజీనామాలు ఆమోదించిన తర్వాత కూడా.. ఇదే పద్ధతి అమలయ్యే అవకాశం ఉంది. బాలినేని శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి ఇప్పటికే వైసీపీ ఎమ్మెల్సీ లయిన జయమంగళ వెంకట రమణ, పోతుల సునీతతో మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. అయితే శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు వారి రాజీనామాలు ఆమోదిస్తారో చూడాలి. ఇప్పుడు అయోధ్య రామిరెడ్డి విషయంలో కూడా బీజేపీ అదే ఫార్ములాను కొనసాగించే అవకా శాలు లేకపోలేదంటున్నారు. దీనిపై ఆయన నాయకత్వం నుంచి ముందస్తు హామీ తీసుకున్న తర్వాతనే, రాజీనామాకు సిద్ధపడుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

#### చెరొక ఫార్ములా కొనసాగింపు..

కాగా వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యులతో వ్యూహం ప్రకారం రాజీనామాలు చేయిస్తున్న నేపథ్యంలో, ఇద్దరేసి సభ్యులు రాజీనామా చేసే సందర్భంలో.. ఒకటి మిగతా.. 2లో



### రాజకీయాల నుంచి

# తప్పుకుంటున్నా

- జగన్‌కు మంచి జరగాలని కోరుకుంటున్నా
- బాబు కుటుంబంతో వ్యక్తిగత విభేధాల్లేవు
- పవన్ నాకు చిరకాల స్నేహితుడు
- వైసీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి

**వైసీపీ రాజ్యసభ ఎంపి, వైసీపీలో కొద్దిరోజుల క్రితం వరకూ నెంబర్‌టూగా వెలిగిన వేణుంబాక విజయసాయిరెడ్డి తన రాజ్యసభ సభ్యత్వానికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన వైనం సంచలనం సృష్టిం చింది. తాను ఇక రాజకీయాల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో ఏ పార్టీలోనూ చేరడం లేదని స్పష్టం చేశారు. విజయసాయిరెడ్డి లేఖ పూర్తి పాఠం ఇదీ..**


**అమరావతి:** రాజ్యసభ సభ్యత్వానికి 25వ తారీఖున రాజీనామా చేస్తున్నాను. ఏ రాజకీయపార్టీ లోను చేరడంలేదు. వేరే పదవులో, ప్రయోజనాలో లేక డబ్బులో ఆశించి రాజీనామా చేరడంలేదు. ఈ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం. ఎలాంటి ఒత్తిళ్లు లేవు. ఎవరూ ప్రభావితం చెయ్యలేదు. నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా నన్ను నమ్మి మిగతా.. 2లో

### సాయిరెడ్డి

### నిష్క్రమణ

# వెనక?

- కోటరీ పెత్తనంతో తగ్గిన ప్రాధాన్యం
- తారకరత్న మృతి తర్వాత సాయిరెడ్డిపై జగన్ అపనమ్మకం
- విజయవాడకు దూరంగా విజయసాయిరెడ్డి
- మళ్లీ ఉత్తరాంధ్ర ఇన్చార్జిగా ఇచ్చి బుజ్జగించిన జగన్
- అయినా విజయసాయిలో తగ్గని అసంతృప్తి
- కాకినాడ పోర్టును కెవిరావుకు ఇచ్చేసిన విజయసాయి బంధువు కంపెనీ
- పోర్టు అప్పగింత వ్యవహారం వ్యూహాత్మకమేనా?



(అన్వేష్)

వైసీపీలో ఒకప్పుడు అధినేత జగన్ తర్వాత బలంగా వినిపించిన పేరు వేణుంబాక విజయసాయిరెడ్డి. జైలులో జగన్ సహనిందితుడిగా కలసి ఉన్న విజయసాయి రెడ్డికి, పార్టీ అధినేత జగన్ తొలుత అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఆ దన్నుతోనే ఆయన ఉత్తరాంధ్రను దున్నేశారు. కలెక్టర్లు, కమిషనర్లు, జేసీలు, ఐజీలు.. ఇలా విజయసాయి ఎవరిని సిఫార్సు చేస్తే వారికి పోస్టింగులిచ్చిన వైభవం ఆయనది. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేష్, పురందేశ్వరి, కన్నా లక్ష్మీనారాయణ, సుజనా చౌదరిపై ఇష్టం వచ్చినట్లు ట్వీట్ చేసిన ఆయన వైసీపీకి అస్త్రంలా మారారు. అలాంటి విజయసాయి.. ఇప్పుడు రాజకీయాలపై వైరాగ్యం ఏర్పడి, పార్టీ-ఎంపీకి జమిలిగా రాజీనామా చేయడం వైసీపీ వర్గాలను విస్మయపరిచింది. మిగతా.. 2లో



ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

# అమ్మా... విశాఖ 'ఉక్కు'ను ఆదుకున్నందుకు ధన్యవాదములు

- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన ఏపీ సీఎం చంద్రబాబు

**న్యూఢిల్లీ:** విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అనే నినాదానికి జీవం పోసేలా, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.11,440 కోట్ల రూపాయల ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించిన సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో కలిసి హృదయ పూర్వక మిగతా.. 2లో



మైత్రీ మూవీస్‌లో మంత్రి పెట్టుబడులు? 03



నాడు ఐటీ... నేడు పునరుత్పాదక విద్యుత్ 03



గోదావరి పుష్కరాలు డేట్ ఫిక్స్ 03

### డబ్ల్యుఎఫ్ వేదికపై ఆంధ్రప్రదేశ్ అంతరంగాన్ని

# ఆవిష్కరించిన 'యువగళం'!

- 30 మందికి పైగా గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి భేటీలు
- 8 రౌండ్ టేబుల్ సమావేశాలు, 9 మంది అంతర్జాతీయ నిపుణులతో చర్చలు
- బ్రాండ్ ఏపీ పునరుద్ధరణ లక్ష్యంగా సాగిన లోకేష్ దావోస్ పర్యటన
- విజయవంతంగా పర్యటన ముగించుకొని రాష్ట్రానికి బయలుదేరిన యువనేత




**దావోస్:** అయిదేళ్ల అరాచకపాలనలో దెబ్బతిన్న బ్రాండ్ ఏపీ పునరుద్ధరణే లక్ష్యంగా వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికపై యువనేత, రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తమ గళాన్ని విన్పించడంలో సఫలీకృతులయ్యారు. దావోస్ లో విజయవంతంగా తన పర్యటన పూర్తిచేసుకుని శుక్రవారం సొంతగడ్డకు బయలుదేరారు. దావోస్ వేదికగా నాలుగురోజులపాటు జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో 30 మందికి పైగా గ్లోబల్ పారిశ్రామిక వేత్తలతో మంత్రి లోకేష్ ముఖాముఖి భేటీ అయ్యారు.

తొలిరోజున స్విట్జర్లాంట్ పారిశ్రామిక వేత్తలు, తెలుగు డయాస్పోరా సమావేశాలకు హాజరై రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ఒకవైపు గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూనే మరోవైపు 8 రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరై ఆయా రంగాల్లో ఆంధ్రప్రభుత్వ విధానాలపై తమ గళాన్ని విన్పించారు. మిగతా.. 2లో

### పీఏఎంవై కింద 20 లక్షల ఇళ్లు

# మంజూరు చేయండి

- మెట్రో ఫేజ్ -IIను జేవీగా చేపట్టాలి
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు రూ.10 వేల కోట్లు కేటాయించండి..
- హైదరాబాద్, వరంగల్ డ్రైనేజీ స్కీంలకు నిధులు ఇవ్వండి..
- కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి




**హైదరాబాద్:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశ పట్టణ జనాభాలో 8 శాతం ప్రజలు తెలంగాణలో ఉన్నారని కేంద్రమంత్రికి సీఎం తెలియజేశారు. పీఏఎంవై (యూ) పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖలపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మిగతా.. 3లో

### హెచ్ఐవి నియంత్రణలో

# మరో ముందడుగు

- 10 కొత్త ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ మరియు టెస్టింగ్ సంచార వాహనాల్ని ప్రారంభించిన వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్
- హెచ్ఐవి సోకినంత మాత్రాన నిరాశపడాల్సిన అవసరం లేదు
- ఆర్నెల్లపాటు ఎఆర్టి చికిత్స అందుకున్న వారికి నెలకు రు.4 వేల పెన్షన్
- ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది
- ఎయిడ్స్ నియంత్రణలో స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన మంత్రి



**అమరావతి:** ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది ప్రజలను పట్టి పీడిస్తున్న హెచ్ఐవి నియంత్రణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సొసైటీ (APSACS) మరో ముందడుగు వేసింది. హెచ్ఐవి వైరస్ ద్వారా వ్యాపించే ఎయిడ్స్ వ్యాధి నిర్ధారణ, వైద్య పరీక్షా సౌకర్యాలను మారుమూల ప్రాంత ప్రజల ముంగిటికి తీసుకెళ్లేందుకు జాతీయ ఎయిడ్స్ నియంత్రణా సంస్థ (NACO) సహకారంతో మిగతా.. 2లో



### రేవంత్.. ఏపీ నీళ్లు

# తీసుకువెళుతుంటే ఏం చేస్తున్నావు?


- ఏమైనా గురు దక్షిణ కింద చెల్లించుకుంటున్నరా?
- ప్రభుత్వం నిద్రపోతున్నదా, సోయి లేదా?
- ప్రధానిని కలిసి ప్రాజెక్టులను ఆపాలని అడిగే సోయి లేదా?
- మీకు సలహాదారుగా పెట్టుకోవడానికి ఇంకెవరూ దొరకలేదా?
- ఒక చీఫ్ సెక్రటరీకి 3 నెలల జైలు శిక్ష పడ్డదంటే ఒక్క ఆదిత్యనాథ్ దాస్ కే
- తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమ నినాదమే నీళ్లు, నిధులు, నియామకాలు. ఇవాళ నీళ్ల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. ముఖ్యమంత్రి, నీటిపారుదలశాఖ మంత్రి, అధికారుల అలసత్వం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉన్నది. గోదావరి నదీ జలాలను పెద్ద ఎత్తున తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తున్నదని, తుంగభద్ర నదిపై ఏపీ, కర్ణాటక రాష్ట్రాలు కొత్త ప్రాజెక్టులు మిగతా.. 4లో

జనం గుండె చప్పుడు
# మహానాడు
2
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 25, జనవరి 2025 ||

# ఏపీ హైకోర్టులో ఇద్దరు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

### ఇద్దరు అదనపు జడ్జిలతో ప్రమాణం చేయించిన సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కొత్తగా నియమితులైన ఇద్దరు అదనపు న్యాయమూర్తులు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణరావుతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. అదనపు న్యాయమూర్తులుగా వీరిరువు బాధ్యలు చేపట్టడంతో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. వీరిరువురిని పదోన్నతిపై హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కోరుతూ కొద్దిరోజుల క్రితం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం కేంద్రానికి సిపార్సు చేసిన విషయం తెలిసిందే. ఈ సిఫార్సు మేరకు వీరిరువురిని అదనపు న్యాయమూర్తులుగా నియమించేందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్రవేశారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి.పొన్నారావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (ఎఫ్ఎసి) శ్రీనివాస శివరాం, పలువులు రిజిస్ట్రార్లు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



దావోస్ పర్యటన ముగించుకుని ఏపీకి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి గన్నవరం విమానాశ్రయం, ఉండవల్లి నివాసం వద్ద స్వాగతం పలికిన రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు.

# దావోస్ ప్రతిపాదనలపై చంద్రబాబు ఫోకస్

మొదటి పేజీ తరువాయి..

సదుపాయాలు, మారిటైం హబ్, ఏఐ యూనివర్సిటీ, జీసీసీ, డేటా సెంటర్, ఫుడ్ ప్రాసెసింగ్, కోర్ ఇంజనీరింగ్, తయారీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఈ కామర్స్, ఇన్నోవేషన్, ఎడ్యుకేషన్ రంగాల్లో ఆయా సంస్థల ప్రతినిధులతో జరిపిన చర్చలను అధికారులకు తెలిపి, రానున్న ఆరు నెలల కాలంలో వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో జరిగిన చర్చల కొనసాగింపుగా పలు దేశాల ప్రతినిధులు, పలు సంస్థల సీఈఓలు, ఆయా దేశాల మంత్రుల బృందాలు త్వరలో రాష్ట్రంలో పర్యటించనున్నాయని, అందుకు ఆయా శాఖలు సన్నద్ధంగా ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. దిగ్గజ కంపెనీల సీఈఓలతో జరిగిన చర్చలపై సంతృప్తిని వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా ప్రతిపాదనలు కార్యరూపం దాల్చి, పెట్టుబడులు పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

కంపెనీలతో నిరంతరంసమీక్షలు, సంప్రదింపులు జరపడం ద్వారా పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా చూడాలని, వీటిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సీఎస్ విజయానంద్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

# అమ్మా... విశాఖ ‘ఉక్కు’ను ఆదుకున్నందుకు ధన్యవాదములు

మొదటి పేజీ తరువాయి..

ధన్యవాదాలు తెలిపినట్టు కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల శాఖల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న బడ్జెట్ సమావేశాలు - 2025 దృష్ట్యా వికసిత ఆంధ్రప్రదేశ్ - 2047 కలని సాకారం చేసేలా, రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు (ముఖ్యంగా పోలవరం - అమరావతి), నూతన ప్రాజెక్టులను కేటాయించి, పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్టు వర్మ పేర్కొన్నారు. ఇంకా, ఆయన ఏ వివరాలు అందించారంటే.. గతంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి తో కలిసి పలుమార్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌ని కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాల్ని గౌరవించాలని పలు దఫాలుగా విజ్ఞప్తి చేశాం. చివరగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై చిత్తశుద్ధి కలిగిన నరేంద్ర మోదీ ప్రభుత్వం కాలయాపన చేయకుండా కేవలం 7 నెలల వ్యవధిలోనే నేడు ప్రత్యేక నిధులు కేటాయించడం అభినందనీయం.

ఈ నిర్ణయం ద్వారా ఎన్నో ఏళ్లుగా కార్మికులు పడుతున్న ఇబ్బందులు తిరిపోయి, విశాఖ ఉక్కు కర్మాగారం పునర్ వైభవ స్థితికి చేరుకొని లాభాల బాటలో పయనిస్తుందని ఆశిస్తున్నాను. మరొక్కసారి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరుపున ముఖ్యంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల తరుపున కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు.

# బీజేపీలోకి వైసీపీ ఎంపీ అయోధ్య రామిరెడ్డి?

మొదటి పేజీ తరువాయి..

టీడీపీ-మరొకటి బీజేపీ తీసుకోవాలన్న, ముందస్తు ఒప్పందాన్ని అమలుచేయాలని నిర్ణ యించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకూ ఆ సూత్రాన్నే కొనసాగిస్తున్నారు. ఫలితంగా రాజ్యసభలో బీజేపీ బలం పెరిగేలా చూడటమే ఈ చేరికల లక్ష్యమంటున్నారు. తర్వాత వరసలో గొల్ల బాబూరావు, పరిమళ్ నత్వానీ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

### రాజ్యసభలో పడిపోతున్న వైసీపీ బలం

ఈ పరిణామాల ఫలితంగా రాజ్యసభలో వైసీపీ బలం పడిపోతోంది. 11 మంది రాజ్యసభ్యులున్న వైసీపీకి, ఇప్పటికే ముగ్గురు ఎంపీలు రాజీనామా చేశారు. వైవి సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, నిరంజన్‌రెడ్డి, మేడా రఘునాథ్ రెడ్డి, పిల్లిసుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీ ప్రస్తుతం వైసీపీలో కొనసాగుతున్నారు. తాజాగా ఎన్నికల ముందు వరకూ పార్లమెంటరీపార్టీ నేతగా వ్యవహరించి, వైసీపీలో చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి కూడా, ఎంపి-పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడంతో రాజీనామా చేసిన వారి సంఖ్య నాలుగుకు చేరుతుంది. ఇక ఆ జాబితాలో అయోధ్య రామిరెడ్డి కూడా చేరితే అది ఐదుకు చేరుతుంది.

# రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా

మొదటి పేజీ తరువాయి..

ఆదరించిన వై యస్ కుటుంబానికి రుణపడి ఉన్నాను. రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్ గారికి, నన్ను ఇంతటి ఉన్నతస్థాయికి తీసుకెళ్ళిన భారతమ్మ గారికి సదా కృతజ్ఞుడిని. జగన్ గారికి మంచి జరగాలని కోరుకుంటున్నా. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్ గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ మరియు రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేశా. కేంద్రానికి రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశా. దాదాపు తొమ్మిది సంవత్సరాలు ప్రోత్సహించి కొండంత బలాన్ని, మనోధైర్యాన్నిచ్చి తెలుగు రాష్ట్రాల్లో నాకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోడీ గారికి, హోం మంత్రి అమిత్ షాకి ప్రత్యేక ధన్యవాదాలు టీడీపీతో రాజకీయంగా విభేదించా. చంద్రబాబు కుటుంబంతో వ్యక్తిగతంగా విభేదాలు లేవు. పవన్ కళ్యాణ్‌తో చిరకాల స్నేహం ఉంది.నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన నా రాష్ట్ర ప్రజలకి, మిత్రులకి, సహచరులకి, పార్టీ కార్యకర్తలకి ప్రతి ఒక్కరికీ పేరు పేరునా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ చేసుకుంటున్నాను.

# 17 మంది కార్పొరేటర్లు నామినేషన్‌ల దాఖలు

◆ ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు

**గుంటూరు, మహానాడు:** నగరపాలక సంస్థ స్థాయీ సంఘ (స్టాండింగ్ కమిటీ) ఎన్నికకు 17 మంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారని స్టాండింగ్ కమిటీ ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఈ నెల 16న నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. ఫిబ్రవరి 3న ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 22 నుండి 24 వరకు 17 మంది నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. నామినేషన్లను ఈ నెల 27న ఉదయం 11 గంటల నుండి స్క్రూట్నీ చేసి, అనంతరం అర్హత కల్గిన నామినేషన్లను ప్రకటిస్తామని తెలిపారు.



నామినేషన్లను వరుసగా పోతురాజు సమత, కొమ్మినేని కోటేశ్వరరావు, దాసరి లక్ష్మీదుర్గ, తేలుకుట్ల హనుమాయమ్మ, ముప్పవరపు భారతి, నూకవరపు బాలాజీ, షేక్ మీరావలి, ఈరంటి వర ప్రసాద్, షేక్ రోషన్, యాట్ల రవి కుమార్, అచ్చాల వెంకట రెడ్డి, అడకా పద్మావతి, రాజలత బూసి, అంజలి మర్రి, పఠాన్ రిహాన, దూపాటి వంశీబాబు, గోపి శ్రీనివాస్ లు దాఖలు చేశారని తెలిపారు.

# హెచ్ఐవి నియంత్రణలో మరో ముందడుగు

మొదటి పేజీ తరువాయి..

ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ మరియు టెస్టింగ్ (ICTC) సంచార వాహనాల్ని ఏర్పాటు చేసింది.

కేంద్ర ప్రభుత్వ న్యాకో (NACO) సహకారంతో కొనుగోలుచేసిన 10 కొత్త సంచార ఐసిటిసి వాహనాలను శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మరియు వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విజయవాడ సిద్దార్థ వైద్య కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే వివిధ స్థాయిల్లోని వైద్యకేంద్రాలలో అందుబాటులో వున్న16 ఐసిటిసిల ద్వారా హెచ్ఐవి వ్యాప్తి నిరోధానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మారుమూల ప్రాంతాల్లో నివశించే వారికి కూడా ఈ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం మొబైల్ ఐసిటిసిలను అందుబాటులోకి తెచ్చిందన్నారు. పూర్తి కేంద్ర ప్రభుత్వ సహకారంతో అందుబాటులోకొచ్చిన ఈ వాహనాల్లో వ్యాధి నిర్ధారణ కోసం మూడు వేర్వేరు కిట్లతో హెచ్ఐవి పరీక్షలను నిర్వహిస్తారన్నారు. సాధారణ వైద్యసేవలు అందుకునేందుకు వీలులేని మారుమూల ప్రాంతాల ప్రజలతో పాటు, హెచ్ఐవి వైరస్ సోకి ప్రమాద స్థితిలో వున్న వారికి, జైళ్లలోని ఖైదీలు, ఇతర వర్గాల వారికి ఈ మొబైల్ ఐసిటిసిల ద్వారా ఎయిడ్స్ గురించి కౌన్సెలింగ్‌తో పాటు పరీక్షలు చేస్తారన్నారు. ఈ మొబైల్ కేంద్రాలలో డిఫరెన్షియల్ హెచ్ఐవి స్క్రీనింగ్ /పరీక్ష, కౌన్సెలింగ్, ఇండెక్స్ పరీక్ష, సామాజిక, లైంగిక నెట్‌వర్క్ మ్యాపింగ్, పరీక్ష, స్క్రీనింగ్ సైట్‌లలోగుర్తించబడిన పెండింగ్ హెచ్ఐవి రియాక్టివ్ కేసుల హెచ్ఐవి నిర్ధారణతో పాటు హెచ్ఐవి, ఎస్టిఐ చికిత్స సేవలు, ఎఆర్టి ప్రకారం ఎఆర్టి మాత్రల పంపిణీ వంటి సేవలందిస్తారన్నారు. ఈ మొబైల్ ఐసిటిసిలలో కౌన్సెలర్, ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్, అటెండెంట్లు సేవలందిస్తారన్నారు. వీటి నిర్వహణకయ్యే వార్షిక వ్యయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు.

న్యాకో గ్లోబల్ ఫండ్ ఫర్ ఎయిడ్స్, టిబి మరియు మలేరియా (GFATM) కింద ఎపిశాక్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (APMSIDC) ద్వారా ఒక్కో వాహనం రూ.30.6 లక్షలు వంతున మొత్తం 10 వాహనాలను కొనుగోలు చేసిందన్నారు. హెచ్ఐవి వైరస్ బారినపడి ఇన్ఫెక్షన్ నిర్ధారణ అయిన వారికి ఎఆర్టి కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు, వైద్య చికిత్స అందచేస్తున్నామని మంత్రి చెప్పారు.

ఈ కేంద్రాల ద్వారా క్రమంగా ఆర్నెల్లపాటు వైద్య చికిత్స అందుకున్న వారికి ప్రభుత్వం నెలకు రు. 4వేల వంతున పెన్షన్ అందజేస్తోందన్నారు. ఆర్నెల్లపాటు ఎఆర్టి కేంద్రాల ద్వారా వైద్య చికిత్స అందుకున్న వారి వివరాలు ఎపిశాక్స్ కు ఆటోమేటిక్గా అప్లోడ్ అవుతాయని, దాని ఆధారంగా ప్రభుత్వం వారికి పెన్షన్ అందచేస్తుందన్నారు.



ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ వివరాల తాజా సమాచారం ప్రకారం, దేశంలోని మొత్తం 25 లక్షలకు పైగా హెచ్ఐవి పాజిటివ్ నిర్ధారణ కేసులు వుండగా, అందులో 2.22 లక్షల కేసులు మన రాష్ట్రంలో ఉన్నాయని మంత్రి సత్యకుమార్ అన్నారు. మహారాష్ట్ర తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండవ అత్యధిక హెచ్ఐవి పాజిటివ్ నిర్ధారణ కేసులను కలిగి ఉందన్నారు. అయితే, హెచ్ఐవి వ్యాప్తి నియంత్రణలో రాష్ట్రం గణనీయమైన పురోగతిని సాధించిందన్నారు.

1998 నాటితో పోలిస్తే 2.4 శాతం మేర వున్న వైరస్ వ్యాప్తిని క్రమంగా తగ్గించుకుంటూ వచ్చామని, ప్రస్తుతం రాష్ట్రంలో వైరస్ వ్యాప్తి రేటు 0.62 శాతానికి తగ్గిందని చెప్పారు. ఈ వైరస్ వ్యాప్తిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. ఎయిడ్స్ నియంత్రణలో ఏపిశాక్స్ మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి సూచించారు.

హెచ్ఐవి నిర్మూలనకు సంబంధించి ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నా రు. హెచ్ఐవి సోకటం నేరమేమీ కాదని, పొరపాట్ల కారణంగా ఈ వైరస్ సోకే అవకాశాలున్నాయన్నారు. ఇందుకు సంబంధించి క్రితం నాటి ఒక ఘటనను మంత్రి ఈ సందర్భంగా వివరించారు. వ్యాధి సంక్రమించినంత మాత్రాన నిరాశపడాల్సిన అవసరం లేదనీ, ఎఆర్టి సెంటర్లలో మందులు తీసుకుంటూ జీవితాన్ని పొడిగించుకోవచ్చునీ నఅన్నారు. సంక్రమిత (CD) వ్యాధుల నుండి మాత్రమే కాక అసాంక్రమిత (NCD) వ్యాధుల నుండి కూడా ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

ప్రభుత్వ కృషిలో స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. జీవన విధానంలో కొద్దిపాటి మార్పులు చేసుకోవటం ద్వారా రక్తపోటు, మధుమేహం వంటి అసాంక్రమిత వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పరీక్షలకు ప్రజలు ముందుకొచ్చి, సహకరించాలని మంత్రి కోరారు. ఆర్థిక వనరుల లోటు వున్నప్పటికీ ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు వైద్య ఆరోగ్య రంగం బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నారని మంత్రి వివరించారు.

ఏటా 70 వేల మంది క్యాన్సర్ బారిన పడగా, 40 వేల మంది చనిపోతున్నారని దీనికి కారణం అవగాహన లోపమేనని అన్నారు. 6 నెలల నుండి 18 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి ప్రభుత్వం 40 రకాల వైద్య పరీక్షలను నిర్వహించి వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుందన్నారు. ప్రజల ముందుకే తీసుకువచ్చిన వైద్య పరీక్షల వాహనాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ప్రజల జీవనశైలిలో మార్పులు రావాల్సి ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ సియస్ ఎం.టి.కృష్ణ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ఎపిశాక్స్ పీడీ డాక్టర్ ఎ.సిరి, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


# డబ్ల్యుఎఫ్ వేదికపై ఆంధ్రప్రదేశ్ అంతరంగాన్ని ఆవిష్కరించిన ‘యువగళం’!

మొదటి పేజీ తరువాయి..

తొమ్మిది మంది వివిధ రంగాల అంతర్జాతీయ నిపుణులతో సమావేశమై ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రకటించిన ఇన్వెస్టర్స్ ఫ్రెండీ విధానాలు, అమలు చేస్తున్న ప్రోత్సహాకాలు, పరిశ్రమలకు అనువైన పర్యావరణ వ్యవస్థ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో ఏపీ ప్రభుత్వ ప్రాధాన్యతలు, అందిస్తున్న ప్రోత్సాహకాలు పారిశ్రామికవేత్తలకు వివరించి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎపి ఏవిధంగా అభివృద్ధి పథంలో పయనిస్తుందో ప్రత్యక్షంగా వివరించారు.

### అనుక్షణం ఏపీ బ్రాండింగ్ పైనే దృష్టి

ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్, మిట్టల్ గ్రూప్ అధినేత లక్ష్మీ మిట్టల్ వంటి దిగ్గజ పారిశ్రామికవేత్తలను కలిసి పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దృక్కోణాన్ని సాక్షాత్కరించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన మంత్రి లోకేష్ ఒక్కక్షణం కూడా వృధా చేయలేదు. ఒకవైపు సమావేశాల్లో పాల్గొంటూనే ఖాళీ దొరికినపుడల్లా సిఎన్ బిసి ల- టివి 18, బిజినెస్ టుడే, ఎకనమిక్ టైమ్స్, బ్లూమ్ బర్గ్, మనీ కంట్రోల్ వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులతో ఇంటరాక్టివ్ సెషన్స్ కు హాజరై ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు గల



అనుకూలతలను వివరిస్తూ పారిశ్రామికవేత్తలను ఆకర్షించే ప్రయత్నం చేశారు.

అంతర్జాతీయంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో తెస్తున్న సంస్కరణలు, ఫ్యార్మాస్యూటికల్, హెల్త్ కేర్, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను అంతర్జాతీయ వేదికపై నుంచి వివరించారు. డబ్ల్యుఈఎఫ్ ఆధ్వర్యాన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సుల్లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అంతరంగాన్ని ఆవిష్కరించారు.

### ప్రతికూల వాతావరణంలోనూ అడుగు ముందుకే!

మైనస్ డిగ్రీల ప్రతికూల వాతావరణంలోనూ ఒకవైపు మంచువర్షం పడుతున్నా లెక్కచేయకుండా పట్టువదలని విక్రమార్కుడిలా దావోస్ రోడ్లపై నడుచుకుంటూ సమావేశాలకు హాజరై ఇతర రాష్ట్రాల ప్రతినిధులతో శెభాష్ అన్పించుకున్నారు. గురువారం తమ పుట్టిన రోజును కూడా పట్టించుకోకుండా రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఉదయం నుంచే పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. స్టాన్ ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదివిన చదివిన చదువు, ప్రపంచ బ్యాంకులో పనిచేసిన అనుభవంతో డబ్ల్యుఈఎఫ్ వేదికగా వివిధ రంగాలపై నిర్వహించిన

సమావేశాల్లో అలవోకగా తన మనోగతాన్ని వెల్లడించారు. ప్రపంచ పారిశ్రామికవేత్తలతో సమావేశమైన సందర్భంలోనూ మంగళగిరి చేనేతలపై తమ అభిమానాన్ని చాటుకున్నారు.

బిల్ గేట్స్, లక్ష్మీమిట్టల్ తో ముఖ్యమంత్రితో కలిసి సమావేశమైన సందర్భంలో మంగళగిరి శాలువాలతోనే వారిని సీఎం చేతులమీదుగా సత్కరించారు. తాము కలిసిన పారిశ్రామికవేత్తలందరినీ మంగళగిరి చేనేత శాలువాతో సన్మానించి తమ అభిమానాన్ని చాటారు. తాను ఎక్కడఉన్నా తమ మనసు మంగళగిరిలోనే ఉంటుందని చెప్పే మంత్రి లోకేష్ మాటల్లోనే కాకుండా చేనేతలపై తన మమకారాన్ని చేతల్లో చూపించారు.

దావోస్ వెళ్లే ముందు మంగళగిరి చేనేత శాలువాలను ప్రత్యేకంగా ఆర్డర్ చేసి సిద్ధంచేసుకొని వెళ్లారు. ఎటువంటి ఆడంబరాలకు తావీయకుండా డబ్ల్యుఈఎఫ్ వేదికగా ఏపీ బ్రాండ్ కోసం లోకేష్ చేసిన కృషి కార్యరూపం దాల్చి త్వరలోనే రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తనున్నాయి.

# సాయిరెడ్డి నిష్క్రమణ వెనక?

మొదటి పేజీ తరువాయి..

అయితే జగన్ చుట్టూ సజ్జల రామకృష్ణారెడ్డి, వైవి సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, తలశిల రఘురాం ఎప్పుడైతే కోటరీగా ఏర్పడ్డారో.. అప్పటినుంచే పార్టీలో విజయసాయి ప్రభ మసకబారటం మొదలయింది. నియామకాలు-సలహాల విషయంలో విజయసాయి సిఫార్సులను పక్కనపెట్టి, జగన్ కోటరీ మాటలకే ప్రాధాన్యం ఇవ్వడంతో విజయసాయి విసిగిపోయారు.

నిజానికి సజ్జల-విజయసాయికి తొలినుంచీ వైరం ఉంది. విజయసాయి జై ల్లో ఉన్నప్పుడు, ఆయన న్యాయవాదులు కూడా జగన్‌తోపాటు ఢిల్లీ నుంచే వచ్చేవారు. అయితే అప్పుడు సాక్షి మీడియా వ్యవహారాలు, తెలంగాణ వైసీపీ వ్యవహారాలు చూసిన సజ్జల.. ఢిల్లీ నుంచి వచ్చే విజయసాయి న్యాయవాదులను వద్దని చెప్పి, హైదరాబాద్ న్యాయవాదులనే ఇచ్చిన వైనం, విజయసాయిని మనస్తాపానికి గురిచేసింది. దానితో ఆయన అప్పట్లో జైలులో తనను కలిసేందుకు వచ్చిన సన్నిహితులతో.. “అన్నీ షిర్డిసాయిబాబానే చూసుకుంటారు. నేను ఎవరికోసం అయితే జైల్లోకి వచ్చానో ఆయన చుట్టూ ఇలాంటి మనుషులు చేరారా”ంటూ ఆవేదన వ్యక్తం చేసేవారన్న ప్రచారం జరిగింది. తర్వాత ఉత్తరాంధ్ర ఇన్చార్జిగా ఉన్న సమయంలో.. విజయసాయిపై ‘మానసిక బలహీనతలకు సంబంధించి’ పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. జగన్ భార్య భారతీరెడ్డి సిఫార్సుతో ఆయనను మార్చి, మళ్లీ సుబ్బారెడ్డికి ఇన్చార్జి పదవి ఇవ్వడం కూడా సాయిరెడ్డికి మనస్తాపం కలిగించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దేవదాయ శాఖ అధికారిణి శాంతి వ్యవహారం పార్టీని ఇబ్బందిపెట్టిన విషయం తెలిసిందే. తన భార్య శాంతికి పుట్టిన బిడ్డ తనది కాదని, ఆ బిడ్డకు విజయసాయిరెడ్డి తండ్రి అంటూ ఆమె భర్త చేసిన ఆరోపణ అటు సాయిరెడ్డి వ్యక్తిగత ప్రతిష్ఠను దారుణంగా దెబ్బతీసింది.

ప్రధానంగా ఒంగోలులో మాజీ మంత్రి, జగన్ బంధువయిన బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ నుంచి నిష్క్రమించేందుకు, విజయసాయి రెడ్డి కారణమంటూ.. సుబ్బారెడ్డి చేసిన ఫిర్యాదు కారణంగానే, విజయసాయిని అక్కడి నుంచి ఇన్చార్జిగా తప్పించారని పార్టీ నేతలు చెబుతున్నారు. తన జిల్లాల్లో విజయసాయి జోక్యం చేసుకోవడం, తన రాజకీయ ప్రత్యర్థి బాలినేనికి విజయసాయి మద్దతునివ్వడమే సుబ్బారెడ్డి ఫిర్యాదుకు ప్రధాన కారణమంటున్నారు. ప్రకాశం జిల్లాలో పార్టీ నేతలను విజయసాయిరెడ్డే బయటకు వెళ్లిపొమ్మని ప్రోత్సహిస్తున్నారంటూ సుబ్బారెడ్డి, పార్టీ అధినేతకు ఫిర్యాదు చేశారన్న ప్రచారం జరిగింది. కాగా నటుడు తారకరత్న చనిపోయిన సందర్భంలో విజయసాయిరెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబుతో సన్నిహితంగా వ్యవహరించినప్పటి నుంచే, విజయసాయి ప్రాధాన్యం తగ్గించడం మొదలయిందంటున్నారు. తర్వాత అప్పట్లో జగన్‌పై యుద్ధం ప్రకటించిన ఏబీఎన్ అధినేత రాధాకృష్ణతో, సాయిరెడ్డి సన్నిహితంగా వ్యవహరిస్తున్నారని, ఫోన్లు లేకుండా ఒంటరిగా ఆటోలో వెళ్లి రాధాకృష్ణను కలసి.. సీఎంఓ, నాటి ఇంటలిజన్స్ అధికారిపై వార్తలు రాయిస్తున్నారన్న ఫిర్యాదు వెళ్లింది. ఆ సమయంలో సీఎంఓపై ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో వచ్చిన వ్యతిరేక వార్తల వెనుక, విజయసాయి ఉన్నారంటూ అటు సీఎంఓ కూడా జగన్‌కు ఫిర్యాదు చేసింది. దానితో జగన్ ఆయనను అనుమానించడం ప్రారంభించారంటున్నారు. అయితే సీఎంఓకు సంబంధించిన కొన్ని వార్తలను నాటి సలహాదారు కూడా ఏబీఎన్‌కు లీక్ చేసేవారన్న ప్రచారం కూడా జరగకపోలేదు.

దానికి తోడు సజ్జల, సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, తలశిల రఘురామ్ కోటరీగా ఏర్పడి, జగన్‌ను ఆ అంశంలో తప్పుదోవపట్టించారన్న చర్చ కూడా పార్టీ వర్గాల్లో జరిగింది. అయితే కోటరీ పితూరీలు విని, పార్టీలో జరుగుతున్న వాస్తవాలు జగన్ తెలుసుకోలేకపోతున్నారని.. సాయిరెడ్డి తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవారంటున్నారు.

అదీగాక సుబ్బారెడ్డికి రాజ్యసభ ఎంపి ఇచ్చిన తర్వాత, తన ప్రాధాన్యతను గణనీయంగా తగ్గించటం కూడా సాయిరెడ్డి అసంతృప్తికి ప్రధాన కారణమంటున్నారు. పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న తనను తొలగించి.. దానిని మిథున్‌రెడ్డికి అప్పగించడం, రాజ్యసభలో ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న తనను పక్కనపెట్టి, సుబ్బారెడ్డికి ప్రాధాన్యం ఇవ్వడాన్ని సాయిరెడ్డి జీర్ణించుకోలేపోయారన్న చర్చ అప్పట్లో పార్టీ వర్గాల్లో జరిగింది.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తనను కరివేపాకులా వాడుకున్న జగన్, కోటరీ మాటలు విని అధికారం కోల్పోయిన తర్వాత.. తనను పక్కనపెట్టడంపై, అనేకసార్లు తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవారంటున్నారు. జగన్ కష్టాల్లో ఉన్నప్పుడు కేంద్రం నుంచి ఆయనపై ఈగవాలకుండా.. అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసిన విజయసాయికి ప్రాధాన్యం తగ్గించడంపై, అటు సీనియర్ నేతలు కూడా అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఇదిలాఉండగా.. విజయసాయి నిష్క్రమణ వ్యూహాత్మకంగానే జరిగినట్లు కనిపిస్తోంది. కొద్దిరోజుల ముందే కాకినాడ పోర్టు అధిపతి కెవి రావును బెదిరించి తీసుకున్న షేర్లు, డబ్బును తిరిగి విజయసాయి బంధువు కంపెనీ అయిన అరబిందో తిరిగి ఇచ్చేసింది. ఈడీ కేసు నేపథ్యంలో కేంద్రంలోని ప్రముఖుల మధ్యవర్తిత్వంతోనే ఈ డీల్ జరిగిందన్న ప్రచారం జరిగింది. అది జరిగిన కొద్దిరోజులకే సాయిరెడ్డి తాను రాజకీయాల నుంచి నిష్క్రమిస్తున్నట్లు వెల్లడించడం ప్రస్తావనార్హం. అంటే సమస్యలన్నీ పరిష్కరించుకున్న తర్వాతనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది.

డిజిటల్ న్యూస్ పేపర్

శనివారం 25, జనవరి 2025

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

## డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 3,21,041

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారథ్యంలో





బోడెపూడి సుబ్బారావు (BSR)
సారథ్యంలో



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 25, జనవరి 2025

# గోదావరి పుష్కరాలు డేట్ ఫిక్స్

- 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాల నిర్వహణకు నిర్ణయం
- 8 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే కేంద్రం రూ. 100 కోట్ల నిధులు
- రాజమండ్రి రైల్వే స్టేషన్ కు రూ 271.43 కోట్లు
- కార్పొరేషన్ పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ.456.5 కోట్లు
- మరో నాలుగు కొత్త ఘాట్లు



**మంగళగిరి,మహానాడు:** ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి జరిగే పుష్కరాల కోసం ప్రభుత్వం ఏర్పాట్లు మొదలు పెట్టింది. ఈసారి గోదావరి పుష్కరాల నిర్వహణలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ సారి పుష్కరాల కోసం 8 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా. 2015 లో ఇదే గోదావరి పుష్కరాల ప్రారంభం వేళ చోటు చేసుకున్న ఘటనలు దృష్టిలో ఉంచుకొని అందరూ ఒకే ఘాట్‌లో స్నానాలు చేసే అవసరం లేకుండా గోదావరి నదిలో ఎక్కడైనా స్నానాలు చేయొచ్చని ప్రచారం చేయనున్నారు.

గోదావరి జిల్లాల్లో పుష్కర ఘాట్ల అభివృద్ధికి అధికార యంత్రాంగం రూ.904 కోట్లతో ప్రతిపాదలు సిద్ధం చేసింది. కేంద్రం ముందస్తుగానే గోదావరి పుష్కరాల కోసం ఇప్పటికే రూ.100 కోట్ల నిధులు కేటాయించింది. తాజాగా రైల్వే శాఖ పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యాల కల్పన కోసం రాజమండ్రి రైల్వే స్టేషన్ కు రూ 271.43 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దేశంలో ప్రధాన ప్రాంతాల నుంచి రాజమండ్రికి ప్రత్యేక రైళ్లు నడుపుతామని.. ముందస్తుగానే వాటి వివరాలు వెల్లడిస్తావంటున్న అధికార యంత్రాంగం. అఖండ గోదావరి పుష్కరాలు-2027 ముసాయిదా యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న 17 ఘాట్లకు రోజుకు 75,11,616 మంది వస్తారని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్, టూరిజం, దేవాదాయ శాఖల అధికారులు సంయుక్తంగా పుష్కర ఏర్పాట్లపై సమీక్ష చేశారు.

యాత్రికుల బస ఏర్పాట్లతోపాటు మరో నాలుగు కొత్త ఘాట్లు అవసరమని భావిస్తున్నారు. రాజమహేంద్రవరం పరిధిలో గోదావరి ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు.కార్పొరేషన్ పరిధిలో రోడ్ల అభివృద్ధికి రూ.456.5 కోట్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, బ్రిడ్జిల అభివృద్ధికి రూ.678.76 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా పుష్కర ఘాట్ల కోసం కావాల్సిన నిధుల పైన అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.


నిధుల సమీకరణతో పాటుగా గోదావరి తీరప్రాంతంలో సమగ్ర అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో గోదావరి పుష్కరాల పై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి కార్యాచరణ ఖరారు చేయనున్నారు.

# మైత్రీ మూవీస్‌లో మంత్రి పెట్టుబడులు?

- ఇప్పటికే మైత్రీమూవీ మేకర్స్‌పై కొనసాగుతున్న ఐటి దాడులు
- అందులో చాలా సినిమాలకు ఓ మంత్రి పెట్టుబడులు?
- ఆ మంత్రి పెట్టుబడులపై ఆరా తీస్తున్న ఐటీ శాఖ
- నేడో రేపో మంత్రి కంపెనీలపై ఐటి దాడులు?
- సినిమా వర్గాల్లో ప్రచారం

(మార్తి సుబ్రహ్మణ్యం)





తెలుగు చిత్ర నిర్మాణ సంస్థల్లో అగ్రభాగాన ఉన్న మైత్రీమూవీస్ సంస్థ కార్యాలయాలపై ఇన్‌కంటాక్స్ శాఖ వరస దాడుల నేపథ్యంలో.. ఏపీకి చెందిన ఒక మంత్రి పెట్టుబడులు కూడా ఆ సంస్థలో ఉన్నట్లు ఐటి అధికారులు గుర్తించినట్లు సమాచారం. దానికి సంబంధించి సదరు కొత్త మంత్రికి చెందిన కార్యాలయాలపై నేడో రేపో దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

తెలుగు సినిమా చరిత్రలో కలెక్షన్లను తిరిగిరాసిన పుష్ప, పుష్ప-1 సినిమా సంస్థ మైత్రీమూవీస్ సంస్థ, నిర్మాత ఇళ్లపై గత రెండురోజుల నుంచి ఐటి శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో మరో బడా నిర్మాయ దిల్‌రాజుకు చెందిన ఆఫీసు, ఇళ్లు, బంధుమిత్రుల ఇళ్లపై కూడా దాడులు నిర్వహిస్తుండటం సంచలనంగా మారింది. పుష్ప సినిమాకు సంబంధించి సమర్పించిన లెక్కలకు, వచ్చిన ఆదాయానికి పొంతన లేకపోవడమే ఆ దాడులకు కారణమని ఐటి వర్గాలు చెబుతున్నారు.

నిజానికి తెలుగు సినిమా రంగంలో భారీ సినిమాలు తీసే అతికొద్ది కంపెనీల్లో మైత్రీమూవీస్ ఒకటి. వాల్తేరు వీరయ్య, గాంధీతాత చెట్టు, సాలార్, రంగస్థలం, సర్కారువారి పాట, వీరసింహారెడ్డి, జనతాగ్యారేజ్, శ్రీమంతుడు వంటి హిట్ సినిమాలు నిర్మించిన మైత్రీమూవీ మేకర్స్.. ఇటీవలి కాలంలో అల్లు అర్జున్ హీరోగా తీసిన పుష్ప సూపర్ డూపర్ హిట్టయింది. తెలుగుచలన చిత్ర గత రికార్డులను పుష్ప సిరీస్ బద్దలు కొట్టాయి. అయితే.. ఆ సినిమాకు సంబంధించి నిర్మాణ సంస్థ, ఐటికి సమర్పించిన లెక్కలపై ఐటి అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. హీరో,దర్శకుడు, సంగీత దర్శకుడు, అగ్ర నటులకు ఇచ్చిన పారితోషికంతోపాటు, సమర్పించిన ఇతర లెక్కలు ఐటి శాఖను సంతృప్తి పరచలేదు. దానితో రంగంలోకి దిగిన ఐటి అధికారులు రెండురోజుల నుంచి వరస దాడులు కొనసాగించారు. దాడుల్లో కొన్ని కీలక పత్రాలు లభ్యమయినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఇదిలాఉండగా.. ఏపీలో కొత్తగా మంత్రి అయిన ఒక పారిశ్రామికవేత్త కూడా మైత్రీ మూవీస్ తీసే సినిమాలకు.. తరచూ పెట్టుబడులు పెడుతున్నట్లు ఐటి వర్గాలు గుర్తించినట్లు, సినిమా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయన గతంలో మహేష్ నటించిన సినిమా నుంచి, ఆ సంస్థలో పెట్టుబడులు పెడుతున్నారని, సినిమా విడుదలయిన తర్వాత తన వాటా తాను తీసుకుంటారని సినిమా వర్గాలు చెబుతున్నాయి. 'మైనింగ్‌ల'తో అనుబంధం ఉన్న సదరు మంత్రికి, సినిమా రంగంతో సన్నిహిత సంబంధాలున్నాయన్నది బహిరంగ రహస్యమేనంటున్నారు. ఆయన తరచూ కొత్త సినిమాల ప్రారంభోత్సవాలకు హాజరవుతుంటారని గుర్తు చేస్తున్నారు.

మైత్రీ మూవీస్ సంస్థలపై ఐటి దాడుల నేపథ్యంలో.. సదరు మంత్రి వ్యాపారసంస్థలపై కూడా, దాడులు జరిగే అవకాశం లేకపోలేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఆ మంత్రి హుటాహుటిన హైదరాబాద్ బయలుదేరినట్లు సమాచారం.

# పీఏంవై కింద 20 లక్షల ఇళ్లు మంజూరు చేయండి

మొదటి పేజీ తరువాయి..

శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పీఎంఏవై2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళికతో సన్నద్ధంగా ఉన్నందున రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. దేశంలోని మహా నగరాలైన ఢిల్లీ, చెన్నై, బెంగళూరుతో పోల్చితే హైదరా బాద్‌లో మెట్రో కనెక్టవిటీ తక్కువగా ఉందని ఈ నేపథ్యంలో మెట్రో ఫేజ్-II కింద ఆరు కారిడార్లను గుర్తించామని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.

ఇందులో కారిడార్ -IV:నాగోల్-శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం(36.8 కి.మీ.), కారిడార్-V:రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), కారిడార్-VI: ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), కారిడార్-VII: మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), కారిడార్-VIII: ఎల్ బీ నగర్-హయత్ నగర్ (7.1 కి.మీ), కారిడార్-IX: రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం-ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) (40 కి.మీ.) ఉన్నాయని.. ఇందులో మొదటి అయిదు కారిడార్లకు సంబంధించి (76.4 కి.మీ.) డీపీఆర్లు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి ఖట్టర్ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు.

ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్లు వ్యయమవుతుందన్నారు. డీపీఆర్లు ఆమోదించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యం (జేవీ) కింద చేపట్టి నిధులు కేటాయించాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీలో మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కి.మీ. (మొత్తంగా 110 కి.మీ.) కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఇందుకోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీపంలోని 27 పట్టణ పాలక సంస్థల పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్లతో సమగ్ర మురుగునీటి మేజర్ ప్లాన్ (సీఎస్ఎంపీ) తయారు చేశామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా సీఎస్ఎంపీని గుర్తించి నిధులు సమకూర్చాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ను నోటిఫై చేసిందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. వరంగల్ నగరంలో రూ.41,70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు...

## పీఎం కుసుమ్ కింద లక్ష సౌర పంపులు కేటాయించండి..

తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన రైతులకు నిరంతరం సాగు నీరు అందించేందుకు వీలుగా పీఎం కుసుమ్ కింద లక్ష సౌర పంపులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కుసుమ్ -సీ ఎఫ్ఎల్ఎస్ కాంపొనెంట్ కింద 2,500 మెగావాట్లను కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. విద్యుత్ సరఫరా, నెట్‌వర్క్ బలోపేతానికి రూ.488 కోట్ల అంచనా వ్యయంతో 9 ప్రాజెక్టు నివేదికలను కేంద్రానికి సమర్పించామని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం, డిప్యూటీ సీఎం కోరారు.

రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీం (ఆర్డీఎస్ఎస్)లో తెలంగాణ డిస్కమ్‌లను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ఇచ్చిన రుణాలకు సంబంధించిన వడ్డీ రేట్లను తగ్గించాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కొత్త పునరుత్పత్తి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి రెండు సంవత్సరాలకు పైగా సమయం పడుతుందని.. అందువల్ల ఆర్‌పీపీవో లక్ష్యాలను చేరుకోలేకపోయినందుకు విధించే జరిమానాలు మాఫీ చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

పునరుత్పత్తి విద్యుత్ నిర్వహణ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌కు అవసరమయ్యే నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. సమీక్షలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్, ప్రజాసంబంధాలు) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి అభినందనలు...

తెలంగాణ రాష్ట్రానికి రూ.1.78 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలంటున్నారని, అందులో తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలిపారు.

# నాడు ఐటీ... నేడు పునరుత్పాదక విద్యుత్

- చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం
- పరిశోధనలతో.. యువత పారిశ్రామికవేత్తలుగా మారాలి
- సీఎం చంద్రబాబు సంస్కరణలతోనే ఐటీ రంగం అభివృద్ధి
- రాబోయే రోజుల్లో క్లీన్ ఎనర్జీదే కీలక పాత్ర
- సిద్ధార్థ సేవలు మరింత విస్తరించాలి.
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి:** ప్రపంచపు ఆధునిక పోకడలను అందిపుచ్చుకుని అభివృద్ధి సాధించాలంటే... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి దార్శనికత ఉన్న నేత అవసరమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విజయవాడలోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రీసెర్చ్ కాంక్లేవ్ - 2025లో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విజనరీ లీడర్, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో.. ఈరోజు తెలుగు రాష్ట్రాల్లో ఐటీ రంగం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశ పెట్టిన ఐటీ అభివృద్ధి విధానాల వలనే... వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు చెందిన ఎంతో మంది.. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ఐటీ రంగంలో.. నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. లక్షలాది మంది తెలుగువారికి గౌరవం తీసుకొచ్చింది ఐటీ రంగ ఉద్యోగాలే అన్నారు.

వ్యవసాయ రంగంలో అప్పుడప్పుడూ వచ్చే ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు గ్రామీణ యువత కూడా ఐటీ రంగంలో... కుటుంబానికో ఉద్యోగం సాధించాలని రెండు దశాబ్దాలకు ముందే పిలుపునిచ్చిన నేత చంద్రబాబు అన్నారు. ముందు చూపుతో ఆయన చెప్పిన మాటలను కొందరు... వ్యవసాయం దండగ అంటూ వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేశారన్నారు.

గతంలో ఏ విధంగా ఐటీ ప్రాధాన్యతను గుర్తించి అభివృద్ధి చేశారో... ఇప్పుడు పునరుత్పాదక విద్యుత్ ప్రాధాన్యతను గుర్తించి అదే విధంగా అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి పెరిగితే... ఆంధ్రప్రదేశ్ ఆదాయం పెరగడంతో పాటు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అంతే కాకుండా కాలుష్యరహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థి దశ నుంచి ఉత్తమ పరిశోధనలతో అవకాశాలను అందిపుచ్చుకుని ఎంతో మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా యువత మారాలని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

## పర్యావరణానికి చేటు చేయకుండా...

రాబోయే రోజుల్లో క్లీన్ ఎనర్జీ ప్రముఖ పాత్ర పోషిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ప్రతి ఏటా 6 నుంచి 7 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతుందని దానికి తగిన విధంగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. థర్మల్ పవర్ వల్ల కాలుష్యం పెరగడంతో పాటు స్థానికులు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని... అందుకే సోలార్, విండ్ వంటి పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలిపారు.

భవిష్యత్తు కార్యచరణకు సంబంధించి ప్రధాని పాల్గొన్న ఒక సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు తాను కూడా పాల్గొన్నానని చెప్పిన గొట్టిపాటి.., 8 రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న ఆ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కరే పునురుత్పాదక విద్యుత్ పై ప్రజెంటేషన్ ఇచ్చారని., రెండు, మూడు దశాబ్దాలు ముందు ఆలోచించే ఆయన దార్శినికతకు అదే నిదర్శనమని కొనియాడారు. సమాజానికి ఉపయోగ పడేలా విద్యార్థులు తమ పరిశోధనలు సాగించి మెరుగైన ఫలితాలు సాధించాలని మంత్రి గొట్టిపాటి అభిలషించారు.

అదే విధంగా సిద్ధార్థ విద్యా సంస్థల సేవలు కేవలం విజయవాడ చుట్టుపక్కల ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాకుండా మారుమూల ప్రాంతాలకూ విస్తరించాలని కోరారు. సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో వ్యవసాయ అనుబంధ కళాశాలల నిర్మాణం కోసం అవసరం అయితే ప్రకాశం జిల్లాలో భూమి కేటాయించమని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు. విద్యా రంగ అభివృద్ధికి సిద్ధార్థ అకాడమీ, దాని అనుబంధ సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి ప్రశంసించారు.



## అనంతపురం, కర్నూలు కేంద్రంగా క్లీన్ ఎనర్జీ...

శాఖపరంగా ఏవైనా అవసరాలు ఉంటే తాను అందుబాటులో ఉంటానని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. రాబోయే ఐదేళ్లలో 24 గంటలూ నాణ్యమైన క్లీన్ ఎనర్జీని రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతపురం, కర్నూలు వంటి జిల్లాల్లో క్లీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రావడంతో పాటు వేలాది మందికి ఉపాధి కలుగుతుందని మంత్రి వెల్లడించారు. కుసుమ్ పథకంతో రైతులకు, సూర్యఘర్ తో సామాన్య ప్రజలందరికీ లబ్ధి చేకూరుతుందని చెప్పారు.

వ్యవసాయానికి పనికిరాని కొన్ని ప్రాంతాల్లోని భూముల్లో సోలార్, విండ్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని.. దీని వలన ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు వేలాది మందికి ఉపాధి లభిస్తుందని స్పష్టం చేశారు. అదే విధంగా రాబోయే దశాబ్ధకాలంలో 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంలో భాగంగా ముందుకు వెళుతున్నామని మంత్రి గొట్టిపాటి ఈ సందర్భంగా స్పష్టం చేశారు

## ట్రాన్స్‌ఫార్మర్ దొంగల్ని పట్టించేలా...

రాబోయే ఐదేళ్లలో పునరుత్పాదక విద్యుత్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని తెలిపిన మంత్రి గొట్టిపాటి.., ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్ డిపార్ట్ మెంట్ ఇంజనీరింగ్ విద్యార్థులు తయారు చేసిన రోబో, ఎలక్ట్రిక్ సైకిల్, రోగులకు ఉపయోగపడే బెడ్ వంటి వివిధ ఆవిష్కరణలను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా వాటి పని తీరుతో పాటు పలు అంశాలపై విద్యార్థులతో మంత్రి ఇష్టాగోష్టి ముచ్చటించారు. అదే విధంగా రైతుల వ్యవసాయ మోటార్లను కొందరు దొంగలు ఎత్తుకు పోతున్నారని దీనివలన అన్నదాత తీవ్రంగా నష్టపోతున్నారని విద్యార్థులకు వెల్లడించారు. విద్యుత్ శాఖ, పోలీస్ శాఖ పరంగా దొంగతనాల నివారణకు తాము కొన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

అయినా విద్యుత్ మోటార్లలో ఉండే కాపర్, అల్యూమినియం కోసం అక్కడక్కడా పొలాల్లో వ్యవసాయ మోటార్ల దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. వాటిని ఆపేందుకు... ట్రాన్స్ ఫార్మర్ల దొంగతనాలు జరగకుండా.. రైతులకు ఉపయుక్తంగా ఉండేలా ఉన్న అవకాశాలపై పరిశోధనలు చేయాలని విద్యార్థులను మంత్రి ప్రోత్సహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనానికి ప్రయత్నించినప్పుడు అలారం మోగడమో లేక... సమాచారం రైతులకు తెలిసే విధంగా ఏవైనా కొత్త ఆవిష్కరణలకు విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమం అనంతరం సిద్దార్థ అకాడమి నిర్వహకులు మంత్రి గొట్టిపాటిని దుశ్శాలువాతో సత్కరించి గౌతమ బుద్ధని బొమ్మను బహూకరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షరీఫ్ అహ్మద్, సిద్దార్థ అకాడమి అధ్యక్షులు మలినేని రాజయ్య, సిద్దార్థ అకాడమి ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వైస్ ఛాన్స లర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో వైస్ ఛాన్స లర్ ఏవీ.రత్నప్రసాద్, కాంక్లేవ్ ఆర్గనైజర్ డా.ఎం.సునీతతో పాటు వివిధ విభాగాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



- రాజ్యాంగం గురించి అవగాహన లేని, రాజ్యాంగం చదవని వ్యక్తి రాహుల్ గాంధీ
- అంబేద్కర్‌ని ఎన్నికల్లో ఓడించి, అనేక రకాలుగా అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ 2025 డైరీని ఆవిష్కరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

# రాహుల్ గాంధీ సర్టిఫికెట్ మాకు అవసరం లేదు

**హైదరాబాద్:** భారతరత్న కర్పూరీ ఠాకూర్ సోషలిస్టు నాయకుడిగా అనేక విద్యార్థి ఉద్యమాలు చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతి కోసం ఉద్యమించారు. శాసనసభ్యుడిగా, విద్యాశాఖ మంత్రిగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా సేవలందించిన మహానుభావుడు కర్పూరీ ఠాకూర్. ఓబీసీ వర్గాలకు సామాజికంగా, రాజకీయంగా సముచిత స్థానం కోసం నిరంతరం పనిచేస్తూ, విశేషంగా సేవలందించారు.

విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. కర్పూరీ ఠాకూర్ గారు చిన్న సామాజిక వర్గం నుంచి వచ్చిన యావత్ సమాజం జననాయక్‌గా పిలిచేలా గుర్తింపు తెచ్చుకున్నారు. విద్యార్థి దశ నుంచే క్విట్ ఇండియా ఉద్యమంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి, 25 నెలల పాటు జైలు జీవితం గడిపిన స్వాతంత్ర్య సమరయోధుడు కర్పూరీ ఠాకూర్ గారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తన సొంత గ్రామంలో స్కూల్ టీచర్ గా పనిచేస్తూనే బడుగు, బలహీన వర్గాలు చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని వారి అభ్యున్నతి కోసం పనిచేశారు.

దేశానికి అధికారిక భాష ఉండాలని నమ్మినటువంటి వ్యక్తుల్లో కర్పూరీ ఠాకూర్ ప్రథముడు. మాతృ భాషను పరిరక్షించుకునేలా హిందీ భాష ప్రోత్సాహానికి విశేష కృషి చేశారు. 1952లో బిహార్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రజా సోషలిస్టు పార్టీ, జాయింట్ సోషలిస్టు పార్టీల్లో విశేషంగా పనిచేసిన మహనీయుడు. 1962లో ఇందిరా గాంధీ హయాంలో అనేక ప్రజాఉద్యమాలు చేశారు. 1970, 1977లో రెండుసార్లు బిహార్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు.

గత సంవత్సరం కర్పూరీ ఠాకూర్ గారి శతజయంతి ఉత్సవాలను నిర్వహించుకున్నాం. నాడు ఇందిరాగాంధీ గారి నియంతృత్వ పాలనకు, అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జనసంఘ్ సోషల్ పార్టీ, పాత కాంగ్రెస్ పార్టీ జయప్రకాష్ నారాయణ్ గారి నేతృత్వంలో కలిసి గళమెత్తాయి. నాడు జైలులోనే వివిధ పార్టీలన్నీ చర్చలు జరిపి జనతా పార్టీగా ఆవిర్భవించడం జరిగింది.

కాంగ్రెస్ పార్టీ అంటే నెహ్రూ కుటుంబంగా వ్యవహరించేవారు. భారతరత్న వంటి అవార్డులు ఆ పార్టీవారికే ఇచ్చుకున్నారు. ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయంలో ఆచార్య కృపలానీ గారు, అటల్ బిహారీ వాజ్ పేయి గారు, జార్జ్ ఫెర్నాండెజ్ గారు, లాల్ కృష్ణ అద్వానీ గారు లాంటి అనేక మంది నాయకులను జైలులో పెట్టారు. నాడు దేశంలో ఇందిరాగాంధీ పాలనకు వ్యతిరేకంగా జనతా పార్టీ ద్వారా ఒక నిశ్శబ్ద విప్లవం వచ్చింది. నాటి ఎన్నికల్లో జనతా పార్టీ ఇందిరాగాంధీ గారిని ఓడించడం జరిగింది.

నాటి ఉద్యమాల్లో కర్పూరీ ఠాకూరీ గారి పాత్ర మరువలేనిది. కులాలు, మతాలకు అతీతంగా దేశ సేవ కోసం పనిచేశారు. గతంలో రాజకీయ పార్టీల కనుసైగల్లో పద్మశ్రీ, పద్మవిభూషణ్ వంటి అవార్డులు వచ్చేవి. నేడు నిస్వార్థంగా దేశం కోసం, సామాజిక పరివర్తన, చైతన్యం కోసం పనిచేస్తున్న మహానుభావులకు పద్మశ్రీ, పద్మవిభూషణ్ అవార్డులు ఇచ్చి గౌరవించుకుంటున్నాం.

ప్రధాని నరేంద్ర మోదీ కర్పూరీ ఠాకూర్ శతజయంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ భారతరత్న ఇచ్చి గౌరవించి, నివాళులర్పించారు. 1970 లో మొట్టమొదటి కాంగ్రెస్సేతర ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు రాష్ట్రంలో రాజకీయ మార్పు తీసుకొచ్చారు. అదే విధంగా బిహార్ రాష్ట్రంలో మొట్టమొదటి కాంగ్రెస్సేతర ముఖ్యమంత్రిగా కర్పూరీ ఠాకూర్ పరిపాలన అందించారు. 1970లోనే మొట్టమొదటిసారి బిహార్ రాష్ట్రంలో మధ్యపాన నిషేధం తీసుకొచ్చారు.

దేశంలో నెహ్రూ కుటుంబం తప్ప మరెవ్వరూ పరిపాలన చేయలేరు. మరెవరికీ ఆ హక్కు లేదని కాంగ్రెస్ భావించేది. అంబేద్కర్ గారిని ఎన్నికల్లో ఓడించి, అనేక రకాలుగా అవమానించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ పార్టీ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలకు విరుద్ధంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా పనిచేసింది. కాంగ్రెస్ పాలనలో ప్రజాప్రభుత్వాలను కూల్చివేసి, పత్రికా స్వేచ్ఛను హరించివేసింది. రాజ్యాంగం గురించి అవగాహన లేని, రాజ్యాంగం చదవని వ్యక్తి రాహుల్ గాంధీకి రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కులేదు.

రాజ్యాంగం గురించి, అంబేద్కర్ గారి గురించి రాహుల్ గాంధీ సర్టిఫికెట్ మాకు అవసరం లేదు. దేశంలోని 140 కోట్లమంది ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వానికి సర్టిఫికెట్ ఇచ్చారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యారు. దేశంలో రాజ్యాంగం ఇబ్బందుల్లో ఉందని, రాజ్యాంగం రద్దవుతుందంటూ విమర్శలు చేస్తున్నది. సూర్యచంద్రులు ఉన్నంతవరకు రాజ్యాంగం రద్దు కాదని స్పష్టం చేస్తున్నాం.

దేశానికి మొదటిప్రధానిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు కావాలని కాంగ్రెస్ పార్టీ నేతలు ఓటువేసి మద్దతు తెలిపినప్పటికీ ఆయనను పక్కనబెట్టి నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారు. ప్రధాని నరేంద్రమోదీ భారతదేశాన్ని మదర్ ఆఫ్ డెమొక్రసీ అంటూ ప్రపంచానికి చాటిచెప్పారు. కాంగ్రెస్ తర్వాత దేశంలో అత్యధిక సమయం ప్రధానమంత్రిగా పనిచేసిన వ్యక్తి నరేంద్ర మోదీ . కర్పూరీ ఠాకూర్, బాబా సాహెబ్ అంబేద్కర్, అటల్ బిహారీ వాజ్ పేయి, జయప్రకాష్ నారాయణ్, మహాత్మాగాంధీ స్ఫూర్తితో, కుమ్రం భీం, రాంజీ గోండు, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో భారతీయ జనతా పార్టీ పనిచేస్తోంది.

అంతకుముందు.. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో భారతరత్న కర్పూరీ ఠాకూర్ గారి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 25, జనవరి 2025 ||



## దేవదాయ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. రామచంద్ర మోహన్

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్‌గా కె.రామ చంద్ర మోహన్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సాయంత్రం వేదపండితుల వేదాశీర్వచనాల నడుమ ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రధాన దేవస్థానాల నుండి అర్చకులు, వేదపండితులు విచ్చేసి ప్రసాదం అందచేసి వేదాశీర్వచనం చేశారు. అదనపు కమిషనర్ చంద్ర కుమార్, చీఫ్ ఇంజనీర్ జి.వి.ఆర్. శేఖర్ , ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ కె.గంగయ్య, స్థపతి పరమేశప్ప, లీగల్ ఆఫీసర్ సూర్యారావు, ఉపకమిషనర్లు హెచ్.జి.వెంకటేష్, మహేశ్వర రెడ్డి, ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల పర్యవేక్షకులు ఉద్యోగినీ ఉద్యోగులు నూతన కమిషనర్ ని అభినందనలతో ముంచెత్తారు.

## 12 కోట్ల 39 లక్షల విలువైన నకిలీ సిగరెట్లు, గంజాయి, గార్లిక్ దగ్ధం

- కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

**యడ్లపాడు:** అక్రమ రవాణాలో వేర్వేరు కేసుల్లో పట్టుబడి, పన్ను చెల్లించని విదేశీ, స్వదేశీ నకిలీ సిగరెట్లు, గంజాయి, చైనీస్ గార్లిక్ లను కస్టమ్స్ మరియు సెంట్రల్ జి.ఎస్.టి అధికారులు అన్నీ అనుమతులతో ధ్వంసం చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం లో గల జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ లోని ఇన్సినరేటర్ లో వీటిని కాల్చి బూడిద చేసారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఔషధ నిర్మూలన పక్షోత్సవంలో భాగంగా వీటిని దగ్ధం చేయడం జరిగింది.

కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డిఅందించిన వివరాల ప్రకారం..దగ్ధం చేసిన వాటిలో ప్యారిస్ బ్రాండ్ పేరుతో విదేశీ గుర్తులు గల సిగరెట్లు 65 లక్షల స్టిక్ లు వున్నాయని, వాటి విలువ 6 కోట్ల 50 లక్షలు వుంటుందన్నారు. అలాగే పన్ను చెల్లించని స్వదేశీ సిగరెట్లు 57 లక్షల స్టిక్ లు వున్నాయని, వీటి విలువ 2 కోట్ల 73 లక్షలు వుంటుందన్నారు. నిషేధిత 2420 కేజీల గంజాయి కూడా పూర్తిగా కాల్చి వేయడం జరిగిందని, దీని విలువ 2 కోట్ల 96 లక్షలు వుంటుందన్నారు. వీటితో పాటు 20 లక్షల విలువ గల ఫంగస్ తో కూడిన 10 టన్నుల చైనీస్ గార్లిక్ ను కూడా నాశనం చేశామన్నారు.



దగ్ధం చేసిన సిగరెట్లు, గంజాయి, గార్లిక్ లు పూర్తిగా నాసిరకంతో కూడుకున్న నకిలీ ఉత్పత్తులని, ఇవి ప్రజారోగ్యానికి ఎంతో హానికరమని కమిషనర్ నరసింహారెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. వీటిని నిల్వ చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శిక్షలు, జరిమానాలు ఉంటాయన్నారు. పొగాకు ఉత్పత్తుల చట్టం కింద నమోదైన చట్టబద్ధమైన చిత్రాలు, హెచ్చరికలు, గడువు తేదీ, తయారీదారు వివరాలు, బ్యాచ్ నెంబర్లను ప్రజలు గమనించాలన్నారు.

నకిలీ సిగరెట్ ఉత్పత్తులను వ్యాపారులు, ప్రజలు ప్రోత్సహించవద్దని కమిషనర్ కోరారు. స్మగ్లింగ్ వ్యతిరేక కార్యకలాపాలు, ప్రజారోగ్యాన్ని కాపాడటంలో మరియు అక్రమ వ్యాపారాన్ని అరికట్టడంలో తమ అధికారులు అప్రమత్తత, అంకితభావంతో పనిచేస్తున్నారని కమిషనర్ తెలిపారు.

## రెడ్‌బుక్ రాజ్యాంగం వల్లే పెట్టుబడులు రావడం లేదు

- ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను దావోస్ వేదికపై నాశనం చేశారు
- తండ్రీ కొడుకుల నిర్వాకంతో పారిశ్రామికవేత్తల పరార్
- జగన్ హయాంలో ఏకంగా రూ.1.26 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చారు
- విశాఖ జీఐఎస్‌లో రూ.13.5 లక్షల కోట్లకు ఎంఓయులు
- బాబు పాలన చూశాక పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది
- వైయస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్‌కె రోజా

**నగరి:** దావోస్ నుంచి ఉత్తి చేతులతో రాష్ట్రానికి తిరిగి రావడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఏ ముఖం పెట్టకుని ఏపీలో అడుగు పెడుతున్నారని అని వైయస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్‌కె రోజా నిలదీశారు. తిరుపతి జిల్లా నగరిలోని క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం వల్లే దావోస్‌లో పారిశ్రామికవేత్తలు పారిపోయారని మండిపడ్డారు.

పక్క రాష్ట్రాల వారు లక్షల కోట్లు పెట్టుబడులతో తిరిగి వస్తుంటే.. చంద్రబాబు మాత్రం కట్టుకథలతో వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దావోస్ వేదికగా అంతర్జాతీయంగా ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తండ్రీ కొడుకులిద్దరూ సర్వనాశనం చేశారని ఆర్‌కె రోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు దావోస్ పర్యటన ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకువస్తారని ప్రజలు భావించారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు. మొదటి ఏడాది దావోస్ వెళ్లారు. రాష్ట్ర ప్రజలు, కూటమి పార్టీల నాయకులు గర్వపడేలా దావోస్ నుంచి భారీ పెట్టుబడులు తీసుకువచ్చి కనీసం ఈ ఏడాది కోసం నాలుగు లక్షల ఉద్యోగాలను కల్పించడం ద్వారా సంపద సృష్టిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూశారు. ఆయన రాష్ట్రంలో కాలుపెట్టగానే భారీగా సన్మానాలు, సత్కారాలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ చంద్రబాబు, లోకేష్ లు దావోస్ కు వెళ్ళి ఏం తీసుకువచ్చారని చూస్తే శూన్యం. ఉత్తి చేతులతో రాష్ట్రానికి



తిరిగి వస్తున్నారు.


పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ రూ.1.32 లక్షల కోట్లు, మహారాష్ట్ర రూ.15.75 లక్షల కోట్లకు ఎంఓయులు చేసుకున్నారు. పద్నాలుగేళ్ళ సీఎం అనుభవం, విజనరీని అని చెప్పుకునే చంద్రబాబు ఎందుకు ఇంత దారుణంగా రాష్ట్రానికే అవమానం కలిగేలా ఉత్తి చేతులతో వస్తున్నారు. చంద్రబాబు అసమర్థ పాలన వల్లే ఈ అవమానం.

చంద్రబాబు, లోకేష్ దావోస్ వెళ్ళేప్పుడు తమ ప్రచారం కోసం లోకేష్‌ను ప్రమోట్ చేసుకునేందుకు జాతీయ మీడియాకు పెద్ద ఎత్తున డబ్బును ఇచ్చేందుకు జీఓలు జారీ చేశారు. పవన్‌కళ్యాణ్ వల్లే ఈరోజు చంద్రబాబు సీఎంగా ఉన్నాడు. కానీ పవన్‌కళ్యాణ్‌ను దావోస్‌కు తీసుకు వెళ్ళలేదు. తన కుమారుడు నారా లోకేష్‌కు రాబోయే రోజుల్లో పవన్‌కళ్యాణ్ అడ్డు వస్తాడనే అనుమానంతో ఆయనను పక్కకు పెట్టారు.

పెట్టుబడులు తీసుకురాలేక పోవడానికి కారణం లోకేష్ రెడ్‌బుక్ పాలనే. వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒకేసారి దావోస్ వెళ్లిన సీఎం వైయస్ జగన్, రూ.1.26 లక్షల కోట్లకు ఎంఓయులు కుదుర్చుకుని వచ్చారు. అలాగే విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో రూ.13.5 లక్షల కోట్లకు ఎంఓయులు చేసుకున్నారు. ఈ నెలలో సాక్షాత్తు ప్రధాని శంకుస్థాపన చేసిన రూ.1.86 లక్షల కోట్ల గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్, అలాగే బల్క్ డ్రగ్ ప్రాజెక్ట్‌లను సీఎంగా వైయస్ జగన్ ఈ రాష్ట్రానికి తీసుకు వచ్చారు.

జగన్ విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు రిలయన్స్ అధినే ముఖేష్ అంబానీతో పాటు, గౌతమ్ ఆదానీ, జిందాల్ వంటి ప్రముఖ పారిశ్రామికవేత్తలు స్వయంగా హాజరయ్యారు. జగన్ పాలనలో కట్టుదిట్టంగా శాంతిభద్రతలు, సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయికి పాలన, మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్ట్‌ల నిర్మాణం, భోగాపురం విమానాశ్రయం పనులు, పది ఫిషింగ్ హార్బర్ ల పనులు ముమ్మరం చేశారు. రెడ్ కార్పెట్ వేసి పారిశ్రామికవేత్తలను ఈ రాష్ట్రానికి ఆయన ఆహ్వానించారు.

చంద్రబాబు మత్తులో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఉన్నాడు. దావోస్‌కు ఆయన్ను తీసుకువెళ్ళలేదు అంటే పవన్ వల్ల ఎటువంటి పెట్టుబడులు రావు అని చంద్రబాబు భావించారా? లేదా లోకేష్‌కు ప్రాధాన్యత తగ్గుతుందని అనుకున్నారా? ఇంకా లోకేష్ డిప్యూటీ సీఎం కావాలన్న భజన చూసిన పారిశ్రామికవేత్తలు దావోస్‌లో అవాక్కయ్యారు.



## ఫీజ్ రీ యింబర్స్‌మెంట్ నిధులు విడుదల

**అమరావతి, మహానాడు:** ఏపీలో మైనార్టీ విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి ఫీజ్ రీ యింబర్స్‌మెంట్ నిధులు విడుదల అయ్యాయి. రూ.40.22 కోట్ల ట్యూషన్ ఫీజు ప్రభుత్వం విడుదల చేసినట్టు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ముస్లిం మైనార్టీ స్టూడెంట్‌కు రూ.37.88కోట్లు, క్రిస్టియన్ మైనార్టీలకు రూ.2.34 కోట్లు మంజూరైనట్టు ఆయన తెలిపారు.



నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్‌ను వారి కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. త్రికోటేశ్వరాస్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాలను అందించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమల గురించి వినతి పత్రాలను అందించారు. కోటప్పకొండ తిరునాళ్ల సందర్బంగా చేస్తున్న ఏర్పాట్లను తెలిపారు. కొత్తపాలెం నుండి కోటప్పకొండ వరకు వెళ్లే రహదారికి సుమారుగా నాలుగు కోట్ల రూపాయలను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే పవన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## రేవంత్.. ఏపీ నీళ్లు తీసుకువెళుతుంటే ఏం చేస్తున్నావు?

మొదటి పేజీ తరువాయి..

కట్టి పెద్దఎత్తున నీళ్లు తరలించుకపోయే ప్రయత్నాలు చేస్తున్నాయని పత్రికల్లో పతాకశీర్షికల్లో వార్తలు వస్తున్నయి.

ఏపీ ప్రభుత్వం ఇప్పటికే పోలవరం రైట్ కెనాల్ ను మూడింతలు పెంచింది. దీంతో 200 టీఎంసీల నీటిని బంకచర్ల ద్వారా పెన్నా బేసిన్ కు తరలించే ప్రయత్నం చేస్తున్నది. ఏపీ యుద్ధ ప్రాతిపదికన ముందుకు పోతున్నా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. సీతారామ సాగర్, సమ్మక్క సాగర్, కాళేశ్వ రంలో 3వ టీఎంసీ, అంబేద్కర్ వార్ధా పెండింగులో ఉన్నాయి ఈ నాలుగు ప్రాజెక్టులకు క్లియరెన్సులు సాధించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. మరోవైపు ఏపీ 200 టీఎంసీల నీటిని గోదావరి నుంచి పెన్నా బేసిన్ కు తీసుకెళ్లడాన్ని యుద్ధ ప్రాతిపదికన, ఆఘమేఘాల మీద చేస్తున్నది. కొత్త ప్రాజెక్టు చేపట్టాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ క్లియరెన్సు కావాలి, వాటర్ అలోకేషన్ కావాలి, ఇంటర్ స్టేట్ క్లియరెన్సు కావాలి, ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్టు ప్రకారంగా గోదావరి, కృష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డుల అనుమతి కావాలి. అపెక్స్ కౌన్సిల్ అనుమతి కావాలి.

ఇవాళ ఏపీ ప్రభుత్వం వీటిలో ఏ అనుమతి లేకుండా గోదావరి – బంకచర్ల ప్రాజెక్టును తీసుకొని పోతున్నది. ఇంత జరుగుతుంటే ఈ ముఖ్యమంత్రి, నీటిపారుదలశాఖ మంత్రి ఏం చేస్తున్నరు? ఏపీ ప్రాజెక్టులను ఆపండి అని కనీసంఉత్తరం కూడా రాయలేదు వీళ్లు. మేం కొత్త ప్రాజెక్టులు కట్టుకుంటున్నాం నిధులివ్వండి అంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు ఏపీ సీఎం చంద్రబాబు లేఖలు కూడా రాశారు. ఏడీబీ నుంచి 40 వేల కోట్ల నిధులిప్పిస్తామని వాళు మాట కూడా ఇచ్చారు. ఇప్పటిదాకా ఈ రాష్ట్ర ప్రభుత్వం నిద్రపోతున్నదా, సోయి లేదా? సీఎం స్వయంగా వెళ్లి కేంద్ర మంత్రులను, ప్రధానిని కలిసి ఈ ప్రాజెక్టులను ఆపాలని అడిగే సోయి లేదా? ఏపీ అక్రమ ప్రాజెక్టులకు కేంద్రం ఏ రకంగా సహకరిస్తుందని అడగాలి కదా? ఎన్నో త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ నీళ్ల విషయంలో నష్టపోవద్దు. సలహాదారులు కూడా ఏం చేస్తున్నట్లు, అధికారులు ఏం చేస్తున్నట్లు? ఏపీ అక్రమంగా కడుతున్న రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు మీద, సుప్రీంకోర్టులో తప్పుడు వాదనలు వినిపించిన ఆదిత్య నాథ్ దాస్‌కి 3 నెలల జైలు శిక్ష వేసింది. ఈ దేశంలో ఒక చీఫ్ సెక్రటరీకి 3 నెలల జైలు శిక్ష పడ్డదంటే, ఒక్క ఆదిత్యనాథ్ దాస్ కే.

ఏపీ ప్రయోజనాల కోసం పనిచేసిన ఇలాంటి అధికారిని సలహాదారుగా పెట్టుకున్నరు. తెలంగాణ ప్రయోజనాలకు గండికొట్టి, తెలంగాణ హక్కులను కాలరాసే అధికారి ఎవరి కోసం పనిచేస్తరు? మీకు సలహాదారుగా పెట్టుకోవడానికి ఇంకెవరూ దొరకలేదా? తెలంగాణ మౌనం వెనుక ఆంతర్యం ఏమిటి? సీఎం ఏమైన గురు దక్షిణ కింద చెల్లించుకుంటున్నరా? మన రాష్ట్ర ప్రయోజనాలు మీకు పట్టవా? ఇది చాలా బాధ కలుగుతున్న అంశం.తుంగభద్ర నీళ్లను తరలించేందుకు అటు కర్ణాటక, ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కాల్వలు తవ్వుకుంటున్నాయి. కల్వకుర్తి, డిండి ఎత్తిపోతలు, సాగర్ ఆయకట్టు నీళ్లందక దెబ్బతినే ప్రమాదం ఉన్నది. ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నది?

2017లో ఏపీ ప్రభుత్వం గోదావరి నుంచి నీళ్లు తరలించే ప్రయత్నం చేస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆపింది. గోదావరి, కృష్ణా బేసిన్లో ఏపీ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ, ఎప్పటికప్పుడు లేఖలు రాశాం. ఆపగలిగాం.ఇక బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విషయానికి వస్తే.. బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్ ఎంతో ప్రయత్నం చేసి సెక్షన్ – 3 సాధించారు. దీనికింద కృష్ణా, గోదావరి జలాలను పున: పంపిణీ చేయాలని అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతికి అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాశారు. అప్పటి నుంచి పోరాడితే, గడ్కరీ వద్ద, షెకావత్ వద్ద, సుప్రీంకోర్టులో చివరిదాకా పోరాడా విజయం సాధించాం. దీనిపై ఈ రాష్ట్ర ప్రభుత్వం కేవియెట్ వేయకపోవడంతో ఏపీ ప్రభుత్వం సెక్షన్ 3 మీద సుప్రీంకోర్టులో కేసు వేసింది. పదేండ్లు మేం కష్టపడి సెక్షన్ 3 సాధిస్తే మీరు దాన్ని కాపాడాలి కదా, వాదనలు వినిపించాలి కదా? రెండు రాష్ట్రాల మధ్య నదీ పరీవాహక ప్రాంతాల ప్రకారం నీళ్లు సాధించుకోవాలి కదా? దీనిపై దృష్టిపెట్టికేంద్రానికి, అన్ని ఫోరమ్స్ కు లేఖలు రాయాలని, అవసరమైతే ఉన్నత న్యాయస్థానంలో పోరాడి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మొద్దు నిద్ర పోతున్న ఈ ప్రభుత్వాన్ని తట్టి లేపడానికే మేం ఈ ప్రెస్ మీట్ పెడుతున్నం.రాజకీయాలకన్నా మాకు రాష్ట్ర ప్రయోజనాలు,హక్కులే ముఖ్యం. మేం రాష్ట్ర ప్రయోజనాల కోసం సూచనలిస్తున్నాం. మీరేమో పట్టించుకోవడం లేదు. మీరు ఢిల్లీ యాత్రల్లో బిజీగా ఉన్నారు. మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడే ప్రయత్నం చేయండి. మీకు నిజాయితీ ఉంటే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి. మేం వచ్చి మీకు విలువైన సూచనలు, సలహాలిస్తాం. అర్థం కాకపోతే అడగండి, చెప్పడానికి మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చిల్లర రాజకీయాలు మానుకోండి, తిట్లు బూతులు వద్దు, మేం తిట్టలేక కాదు, బూతులు మాట్లాడలేక కాదు. సమయం, సందర్భం వచ్చినపుడు రాజకీయాలు పక్కనపెట్టి, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోవాలి. ఇతర రాష్ట్రాలను చూసి నేర్చుకోవాలి. ఆ నీళ్లు సాధించుకోవడానికి, అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవడానికి ఈ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కండ్లు తెరిచి, యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మేం బీఆర్‌ఎస్ పక్షాన కోరుతున్నాం.



## కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్‌కు సెలెక్ట్ అవటం ఆనందం

- కష్టపడి చదువుకునే ప్రతి పేద విద్యార్థికి వారి కష్టసుఖాల్లో తోడుంటా :మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం:** దాక్షారామంటౌన్‌లో నివాస ఉంటున్న అల్లం రాజేష్ కుమారుడు అల్లం ప్రియదర్శిన్ కార్తీక్ కిక్ బాక్సింగ్ నేషనల్ సెలెక్ట్ అవటం జరిగింది. వీరి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని మంత్రి సుభాష్ దృష్టికి తీసుకురావడంతో.. మంత్రి స్పందించి క్రీడలలో కృషి పట్టుదల ఉన్న విద్యార్థులను ప్రోత్సహించి, వారిని ఉన్నత స్థితికి తీసుకు రావాలి అనేది తన కోరికని, వారి ఎదుగుదల కోసం నా ప్రోత్సాహం ఎప్పుడు ఉంటుందని, నేషనల్‌లో గోల్డ్ మెడల్స్ సాధించాలని ఆ విద్యార్థికి 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగింది.



## ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్‌గా కన్నబాబు బాధ్యతల స్వీకరణ

**అమరావతి, మహానాడు:** ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్‌గా కె. కన్నబాబు బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సీఆర్‌డీఏ కమిషనర్ గా ఉన్న కాటమనేని భాస్కర్ ను బదిలీ చేసి, ఆయన స్థానంలో కన్నబాబును నియమించింది. ఈ మేరకు ఆయన విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

## మళ్ళీ రియల్ ఎస్టేట్ పుంజుకుంటుందా?

- అమెరికా నూతన అధ్యక్షుడు నిర్ణయాలతో భారత పట్టణాలకు మహర్దశ?
- ప్రవాస భారతీయులు స్వదేశీ పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నారా?

(ఏ.బాబు)

అగ్రరాజ్యం అమెరికా సరికొత్త పంథా లో వెళుతుంది. ట్రంప్ అధికారంలోకి రాగానే ప్రపంచ దేశాల్లో అలజడి మొదలైంది...కానీ ట్రంప్ నిర్ణయాలు మనకు ఆశాజనకంగా మారనున్నాయి. అమెరికా ఇప్పుడు ప్రపంచ పోలీస్! వాళ్ళు చెప్పిందే వేదం. పశ్చిమాసియా లో యుద్ధం తీవ్రంగా ఉన్నాకూడా ముఖ్యంగా చమురు, సహజవాయువు దిగుమతి లో భారత్ పట్ల గల్ఫ్ దేశాలు సానుభూతి వైఖరి అవలంభించడం వల్ల చమురు ధరలు పెరగలేదు! పెరిగినా కూడా భారత ప్రభుత్వం పరోక్ష పన్నుల రూపంలో సామాన్యుడిపై ధర కనబడకుండా చేసింది.

ఇప్పుడు గల్ఫ్ దేశాల్లో ఉన్న కోటి మంది భారతీయులు యుద్ధ భయాలతో స్వదేశీ బాట పడుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం పోయిన వాళ్ళు వారి సొంత గ్రామాల్లో ఒకటో రెండో ఎకరాలు కొన్నారు. గుడిసెల ఇళ్ల నుండి కాంక్రీట్ ఇళ్లు కట్టుకున్నారు. అక్కడ సంపాదించిన డబ్బుతో పిల్లలకు ఇంజనీరింగ్ కోర్సులు చదివించారు. ఇప్పుడు అమెరికా మారుతున్న ప్రపంచంలో వాళ్ళు స్టార్టప్ కంపెనీలో ఉద్యోగాలు కోసం వేచి చూస్తున్నారు!

ఇక చుట్టూ ముస్లిం దేశాలలో నిరంతర యుద్దాలు చేస్తున్న ఇజ్రాయిల్ కూడా బాగా అలసి పోయింది. వాళ్లకు ఇప్పుడు భారత్ ఇంజనీరింగ్ విద్యార్థుల ఆర్టిఫీషియల్ ఇంజనీరింగ్ స్కిల్స్ కావాలి. ఎందుకంటే అక్కడ ప్రతి పౌరుడు యుద్ధ భూమిలో ఉన్నారు. కాబట్టి మన స్టూడెంట్ ల నుండి సరికొత్త పరిజ్ఞానం కావాలి అంటే మన భారత మెట్రోపాలిటీ సిటీలో సరికొత్త కార్యాలయాలు తెరవబోతున్నారు.

ఇప్పుడు అమెరికా దేశం ఇక కలల రాజ్యాంగ మారనుందా? అమెరికా వెళ్ళడానికి కొత్తగా హెచ్ 1 బీ విసాలు ఇక ఎండ మావులే! ట్రంప్ తీసుకున్న నిర్ణయం చాలా మందికి భయం కొలుపుతున్న కూడా...ఒక తెలియని విషయం ఏమిటంటే భారత ఐటీ కంపెనీలు త్వరగా పుంజుకొనున్నాయి. దానికి కారణం అమెరికా వలస వాద విధానం వల్ల మొదటగా హెచ్ వన్ బీ విసాల దరఖాస్తులు కఠినం కానున్నాయి.

ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (OPT) అర్హత పరీక్షలో భారత నుండీ ఇప్పటి వరకు అమెరికా లక్ష మందిని ఇండియా నుండి తీసుకునేది! ఇప్పుడు ఇరవై ఐదు వేల మంది విద్యార్థులు కూడా అమెరికా వెళ్ళలేని పరిస్థితి వస్తుంది. ఇదీ అమెరికా వ్యూహమే. ఎందుకంటే ఇంటలిజెన్స్ పేరిట అమెరికా లో వేలాది డాలర్ల లు ఇచ్చి ఉద్యోగ నియామకాల కన్నా ఇండియా లో అంతకన్నా తక్కువ వేతనాలు తో భారతీయ విద్యార్థుల ప్రతిభను క్యాష్ చేసుకునే అవకాశాలు అమెరికా చేస్తుంది. గత ట్రంప్ పరిపాలనలో తిరస్కరణ రేట్లు ఆల్ టైమ్ గరిష్ట స్థాయి 24 శాతానికి కి చేరుకున్నందున, హెచ్1బీ అప్లికేషన్లు కఠినమైన పరిశీలనను ఎదుర్కోవాలి.. భారత ఐటీ కంపెనీలు రిపబ్లికన్ విజయాన్ని సంబరాలు చేసుకున్నాయి.

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడతారని స్పష్టత రావడంతో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా , హెచ్‌సీఎల్, విప్రో తో పాటు అమెరికా ఔట్ సోర్సింగ్ ప్రాజెక్టులు కైవసం చేసుకొని తక్కువ వేతనాల తో భారతీయ టెక్ జాబర్స్ కు ఉపాధి కల్పించే అవకాశాలు ఇక్కడ మెరుగు అవుతాయి! ఇవన్నీ రెండేళ్ల తరువాత మనకు ఫలితాలనిస్తాయి.

బలమైన డాలర్ భారతీయ ఔట్ సోర్సింగ్ పరిశ్రమకు ప్రయోజనం చేకూరుస్తుంది. మెజారిటీ ఐటీ సేవల కంపెనీలు యూఎస్‌ను కీలక వ్యాపార మార్కెట్గా అందజేయనున్నాయి. తద్వారా ఐటీ రంగం వారి నిర్వహణ ఖర్చులు భారతీయ రూపాల్లో ఉన్నప్పటికీ యూఎస్ కరెన్సీలో వారి ఆదాయంలో అధిక భాగాన్ని పొందుతుంది. డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన కొత్త సవరణలు అమలు కావడానికి మరో మూడు నెలలు పడుతుంది. ట్రంప్ నిర్ణయం అమలైతే బడ్జెట్ ఒత్తిళ్లను తగ్గించడానికి, యూఎస్ కంపెనీల టెక్ ఖర్చులను విస్తరించడానికి, తద్వారా యూఎస్‌లో నమోదు చేసుకున్న భారతీయ స్టార్టప్లకు, టెక్నాలజీ కంపెనీలకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది..

### చైనాకు ప్రత్యామ్నాయం

చైనాపై డొనాల్డ్ ట్రంప్ కఠినమైన వైఖరి అవలంబిస్తే భారతదేశానికి యూఎస్ నిధుల ప్రవాహం పెరుగుతుందని నిపుణులు అంచనా



వేస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో ఏఐతో పాటు సెమీకండక్టర్ల వంటి అధునాతన సాంకేతికతలపై యూఎస్ పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే గత పదేళ్లుగా అమెరికా లో నివసిస్తున్న వాళ్ళు కూడా ట్రంప్ నిర్ణయాలతో ఇండియాలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తారు. లేదా పట్టణాల్లో, గ్రామాల్లో భూమి లేదా ప్లాట్స్ తీసుకోవడానిక్ త్వరలో ముందుకు రానున్నారు.

ఇప్పటివరకు అమెరికాలో పది కోట్లు (ఇండియా కరెన్సీ) పెట్టి ఇల్లు తీసుకున్న ఉద్యోగులు ఇప్పుడు అక్కడ ఆస్తులు అమ్మేసి హైదరాబాద్ ,విశాఖపట్నం, విజయవాడ అమరావతిలో త్వరలో ఇళ్లు కొనుక్కునే పరిస్థితి వచ్చింది...హైదరాబాద్, వైజాగ్ లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటే ఈ డబ్బులు గ్రామాల్లో భూముల కొనుగోళ్లు పెరుగుతాయి. అలాగే జిల్లాల్లో కూడా త్వరలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోబోతుంది.

జనం గుండె చప్పుడు
# మహానాడు
5
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 25, జనవరి 2025

## సమ్మక్క- సారలమ్మ వన దేవతలను దర్శించుకున్న మంత్రులు సీతక్క, సురేఖ



మేడారం: శుక్రవారం తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్న రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, పర్యావరణ, అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ కొండా సురేఖ, ఎంపీ బలరాంనాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. లకు గిరిజన పూజారులు, ఎండోమెంట్ అధికారులు సన్నాయి, డోలువాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు.

## ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణం

- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే
- వైఎస్సార్సీపీ ఆలూరు ఎమ్మెల్యే బూసినె విరూపాక్షి ఆగ్రహం



ఆలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు వైయస్సార్సీపీ సానుభూతి పరులు, కార్యకర్తలను చంపడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి తీవ్రంగా మండిపడ్డారు. ఈ రకమైన పరిపాలన దేశంలో ఎక్కడా లేదని ఆక్షేపించారు. వైయస్సార్సీపీ కార్యకర్తలను వేధించడానికే ప్రజలు అధికారం ఇచ్చారన్నట్టుగా నిత్యం దాడులతో రాష్ట్రాన్ని వల్లకాడుగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలన గాలికొదిలేసిందేకాక కక్షలు, కార్పణ్యాలతో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారన్నారు.

కర్నూలు జిల్లా ఆలూరు మండలం ఆరికెరిలో విధులు ముగించుకుని వస్తుండగా దారుణ హత్యకు గురైన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వీరన్న మృతికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే... ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఎవరికీ హాని తలపెట్టని వీరన్నపై టీడీపీ కార్యకర్తలే దాడి చేసి చంపారన్నారు. దాడి చేసిన వారు ఎవరైనా వారిని వదిలిపెట్టబోమని... తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

వైయస్.జగన్మోహన్ రెడ్డి పాలనలో ఏనాడు ఇలాంటి ఘటనలు లేవని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వగానే రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా ఇలాంటి మారణహోమాన్ని ఆపాలన్న ఆయన, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. జరిగిన ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలని విరూపాక్షి డిమాండ్ చేశారు.

## ప్రజావాణికి జన ప్రభంజనం

- ప్రజావాణిలో 8, 603 దరఖాస్తులు
- రికార్డు స్థాయిలో ప్రజావాణిలో దరఖాస్తుల నమోదు
- సింహ భాగం ఇందిరమ్మ ఇండ్ల కోసమే
- దరఖాస్తులు స్వీకరించిన ప్రజావాణి ఇంచార్జీ చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య

హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 8, 603 దరఖాస్తులు అందాయి. అందులో సింహ భాగం 8,100 ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులు ఉన్నాయి.



పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 252, విద్యుత్ శాఖ కు సంబంధించి 110, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 51, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 5, ఇతర శాఖలకు సంబంధించి 85 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 8,100 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్. జీ.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



## పెవిలియన్ రద్దీగా తెలంగాణ

- 50 వేల నుంచి 75 వేల ఉద్యోగాలు లభించే అవకాశం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్: దావోస్ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 50 వేల నుంచి 75 వేల ఉద్యోగాలు లభించే అవకాశముందని, బీఆర్ఎస్ గత పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. దావోస్‌లో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లడం వల్ల పెట్టుబడులపై నమ్మకం కుదిరిందన్నారు. తెలంగాణ పెవిలియన్ రద్దీగా మారిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. మంచి జరుగుతుంటే ప్రశంసించడం నేర్చుకోవాలని ప్రతిపక్షానికి హితవు పలికారు.

ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వడమే బీఆర్ఎస్ పని అని, గత ప్రభుత్వ పాలన కారణంగా నెలకు ఆరున్నర వేల కోట్ల రూపాయల వడ్డీ కడుతున్నట్లు పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పెద్దగా తెచ్చిన పెట్టుబడులు లేవన్నారు. అభివృద్ధి, పెట్టుబడులపై బీఆర్ఎస్ ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. తమని విమర్శించే ప్రతిపక్షాలు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.







## వైసీపీ పాలనలో భూ కబ్జాలు, నేతల మోసాలు

- టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి ఆనం, దేవేంద్రప్ప

మంగళగిరి: టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన నిందితుడు ఒగ్గు గవాస్కర్ అండతో గానుగపెంట శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి దొంగ డాక్యుమెంట్ లు సృష్టించి తమ స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా తనపైనే తప్పుడు కేసులు పెట్టారని.. దీనిపై విచారించి అక్రమ కేసుల నుండి తనను తొలగించి కబ్జా నుండి తన స్థలాన్ని విడిపించి తమకు న్యాయం చేయాలని విజయవాడకు చెందిన రిటైర్డ్ టీచర్ పి. అరవింద అర్జీ ఇచ్చి విజ్ఞప్తిచేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కురబ డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప పాల్గొని, వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.

- మైదుకూరుకు చెందిన వైసీపీ నాయకుడు ఉపేంద్ర పట్టాభి సీతారామరాజు తమ భూమిని అక్రమంగా ఆన్ లైన్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని.. దీనిపై విచారణ జరిపించి అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కడప జిల్లా కాశినాయన మండలం కేవన్ కొట్టాల గ్రామానికి చెందిన ఒరుసు కృష్ణకుమార్ నేతలకు విజ్ఞప్తి చేశారు.
- సునిపెంటకు చెందిన వైసీపీ లీడర్ సయ్యద్ నూర్ బాషా గత ప్రభుత్వంలో తమకు శ్రీశైలం దేవస్థానంలో షాపులను ఇప్పిస్తానని చెప్పి తమ వద్ద రూ. 10 లక్షల డబ్బులు తీసుకొని మోసం చేశారని.. అతనిపై చర్యలు తీసుకొని తమకు డబ్బులు ఇప్పించేలా చూడాలని నంద్యాల జిల్లా శ్రీశైలానికి చెందిన సగ్గిల రామయ్య వేడుకున్నారు.
- తన అత్త తనకు రాసి ఇచ్చిన భూమిని గత ప్రభుత్వంలో తనకు తెలియకుండా జగనన్న కాలనీ పేరుతో తీసుకొని అధికారులు కబ్జాదారులు ప్రభుత్వం నుండి రూ. 50 లక్షలు కొట్టేశారని.. వారిపై చర్యలు తీసుకొని తనకు రావాల్సిన పరిహారం ఇప్పించవలసిందిగా తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలానికి చెందిన కొల్లి ఆనంద్ బాబు



విజ్ఞప్తి చేశారు.

- కర్నూలు జిల్లా హొళగుంద మండలం ఎండీహళ్లి గ్రామ సర్పంచ్ జి. సుధాకర్ విజ్ఞప్తి చేస్తూ.. కర్నాటక బార్డర్ లో ఉన్న తమ గ్రామం అభివృద్ధికి దూరంగా ఉందని.. గ్రామంలో మౌలిక వసతులైన రోడ్లు డ్రైన్లు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని.. దయ చేసి తమకు గ్రామానికి నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- రంగయ్య అనే కానిస్టేబుల్ తనకు దొంగ డాక్యుమెంట్లతో స్థలాన్ని అమ్మి డబ్బులు కొట్టేశాడని.. అతనిపై చర్యలు తీసుకొని అతని నుండి తిరిగి డబ్బులు ఇప్పించాల్సిందిగా.. నంద్యాల జిల్లా గడివేముల మండలానికి చెందిన పి. రామకృష్ణరావు గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేశారు.
- తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం ముదిమూరు గ్రామానికి చెందిన బి. మునిశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో 2014 -2019 మధ్య అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్లు నిర్మించామని అందుకు సంబంధించి బిల్లులు ఇంకా 30% పెండింగ్ ఉన్నాయని వాటిని ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నారు.
- రెవెన్యూ శాఖలో ఆర్ ఐగా పనిచేస్తున్న తన భార్య తనకు దూరంగా ఉంటూ. పిల్లలకు చిత్ర హింసలు పెడుతోం దని పిల్లల చెంపలు ఒంటిపై వాతలు పెట్టి హింసించిందని.. కన్న తల్లె కాకుండా ప్రభుత్వ అధికారిననే విచక్షణ మరచి పిల్లాడిని హింసించిన తనభార్యపై చర్యలు తీసుకొవాలని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన రామవతు నాయక్ విజ్ఞప్తి చేశారు.
- తమ తాతల నుండి సాగుచేసుకుంటూ.. 2021 వరకు ఆన్‌లైన్‌లో ఉన్న తమ భూమిని 2022 ఆన్‌లైన్‌లో అక్రమంగా తమ పేరు మార్చిలో వైసీపీ నాయకుడు లక్ష్మీనారాయణ గుప్త పేరు ఎక్కించారని.. దీనిపై విచారణ జరిపి అక్రమ పేర్ల మార్పుపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కర్నూలు జిల్లా పత్తి కొండ మండలానికి చెందిన మేదర మేరి విజ్ఞప్తి చేశారు.

## రేవంత్ ప్రభుత్వంలో విచ్చలవిడిగా భూకబ్జాలు.. భూదందాలు

- బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో భూదందాలు పెరిగిపోయాయి. భకజ్జాలు పెరిగిపోయాయి. ధరణి పోర్టల్ ను తీసివేసి భూమాతను తీసుకొస్తామని చెప్పిన రేవంత్ ప్రభుత్వంలో.. ఈరోజు విచ్చలవిడిగా భూకబ్జాలు చేస్తూ బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో భూ అక్రమాలు మరింత పెరిగిపోయాయి.

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని భూ అక్రమార్కుల ఆగడాలకు, వేధింపులకు గురైన బాధితులు.. మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ వద్ద తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా బాధితులకు ఎలాంటి భరోసా కల్పించలేదు, రక్షణ కల్పించలేదు. బాధితుల పక్షాన ఘటనా స్థలికి ఈటల రాజేందర్ వెళ్లారు. పరిస్థితిని పర్యవేక్షిస్తున్న సమయంలో కబ్జాదారుల తాబేదార్లు దురుసుగా ప్రవర్తించారు. దాంతో వారిని నిలువరించారు.

అదేవిధంగా రాష్ట్రంలో భూకబ్జాలకు వ్యతిరేకంగా మెదక్



పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు కూడా పోరాటం కొనసాగిస్తున్నారు. పేదల పక్షాన, భూకబ్జాలకు వ్యతిరేకంగా బిజెపి పోరాటం కొనసాగిస్తూనే ఉంటుంది. ఇప్పటికైనా రాష్ట్రంలో కబ్జాలను అరికట్టి, చట్టాన్ని గౌరవించాలి. బాధితులకు అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో అనేకమంది పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. మరోవైపు ప్రభుత్వం అండతో కబ్జాదారులు, కాంగ్రెస్ నాయకులు, వారి అనుచరులు అక్రమాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు లోన్ తెచ్చుకుని, చట్టపరంగా అన్ని అనుమతులు తీసుకుని, డాక్యుమెంట్లు ఉండి, కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా కొనుగోలు చేసిన ప్రజల ఇండ్లను కూడా కూల్చివేసి మరీ.. భూకబ్జాదారులు ఆక్రమిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పేద ప్రజలు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ప్రజల భూములను కబ్జా చేయడాన్ని సహించం. ఆఖరుకు పోలీసు అధికారులకు సంబంధించిన 2 వేలకు పైగా ప్లాట్లను సైతం రికార్డుల్లో మార్చివేశారంటే.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎటువంటి భూమాయ జరుగుతుందో అర్థమవుతోంది.

భూ కబ్జాదారుల ఆగడాలను బిజెపి తీవ్రంగా ఖండిస్తోంది. దీనిపై బీజేపీ చేస్తున్న పోరాటం ఆగదు. ఇప్పటికైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని, ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్రంలో కబ్జాలను అరికట్టి, బాధితులకు రక్షణ కల్పించి అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. సమావేశంలో బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ నాయక్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.





## గణతంత్ర దినోత్సవ వేళ విద్యుత్ దీపకాంతులతో వెలుగొందుతున్న అసెంబ్లీ,సచివాలయం

అమరావతి: ఈనెల 26వతేది ఆదివారం 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు జరగనున్న నేపధ్యంలో రాష్ట్ర అసెంబ్లీ మరియు సచివాలయ భవనాలను విద్యుత్ దీపాలతో అత్యంత సర్వాంగ సుందరంగా అలంకరించడంతో ఆ భవనాలన్నీ విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి.ముఖ్యంగా సచివాలయం ప్రధాన ప్రవేశ మార్గానికి సమీపంలో గల సచివాలయ ఐదవ భవనాన్ని మువ్వన్నెల జాతీయ జెండా నమూనా రంగులతో కూడిన విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ఆభవనం అత్యంత ఆకర్షణీయంగా జాతీయత ఉట్టిపడేలా చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

రాష్ట్ర అసెంబ్లీ భవనంతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్న సచివాలయం మొదటి భవనంతో పాటు మిగతా నాలుగు భవనాలన్నిటినీ వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ఈభవనాలన్నీమిరిమిట్లు గొలిపే రీతిలో వెలుగులు విరజిమ్ముతున్నాయి.

అంతేగాక గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగానే రాష్ట్ర సచివాలయం,అసెంబ్లీ ప్రాంగణాల్లో గణతంత్ర శోభ నెలకొంది.







06
జనం గుండె చప్పుడు
మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 25, జనవరి 2025 ||

# సీఎం దావోస్ పర్యటన విజయవంతం



**కొమ్మాలపాటి శ్రీధర్**

పల్నాడు, మహానాడు: చంద్రబాబు నాయుడి దావోస్ పర్యటన విజయవంతమైందని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీ బ్రాండ్ ఇమేజ్ ను దావోస్ సదస్సు వేదికగా ప్రపంచ దేశాలకు చాటడం ద్వారా పర్యటన విజయవంతమైందన్నారు. జ్యూరిచ్‌లోని హిల్టన్ హొటల్‌లో స్విట్జర్లాండ్ లోని భారత రాయబారి మృదుల్ కుమార్ తో సమావేశం, స్విస్ కంపెనీలు ఓర్లికాన్, స్విస్ మెన్, ఆంగ్స్ ఫిష్టర్, స్విస్ టెక్స్టైల్స్ సంస్థల సీఈఓ లతో ఏపీ లో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారని తెలిపారు. సీఐఐ నిర్వహించిన ప్రత్యేక సెషన్‌లో పాల్గొని గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ పై ఎంతో ఆసక్తిదాయకంగా ప్రసంగించి, స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ లోని 10 మార్గదర్శక సూత్రాలను వివరించారన్నారు.



తన పుట్టిన రోజు సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ తిరుమల తిరుపతి దేవస్థానంకు రూ. 10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. కోడెల ఆశయాలకు అనుగుణంగా కోడెల శివప్రసాదరావు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాలాజీ ఆరోగ్య వరప్రసాదినిలోని వైద్య సేవలకు ఈ విరాళాన్ని వినియోగించాలని శివరామ్ కోరారు.



తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ మంత్రి, నిరంతరం పేదప్రజల పక్షాన పోరాడి, అసువులు బాసి వారి గుండె చప్పుడుగా నిలిచిపోయిన దివంగత పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి సందర్భంగా వెంకటాపురంలోని ఆయన ఘాట్ కు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్ పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## పేదల మనీషి పరిటాల రవీంద్ర

- మంత్రి సవిత

పెనుకొండ, మహానాడు: ఫ్యాక్షనిస్టుల అరాచకాలతో బలవుతున్న ప్రజల పక్షాన నిలిచి, సమాజ సమానత్వ సాధన కోసం కృషిచేస్తూ, తాను అభిమానించిన ప్రజల మధ్యనే దివంగత మాజీ మంత్రి, పెనుకొండ శాసన సభ్యుడు పరిటాల రవీంద్ర తుది వీడ్కోలు తీసుకున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. పరిటాల వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆఖరి శ్వాస వరకూ పేద ప్రజల కోసం పోరాడిన ధీరుడు పరిటాల రవీంద్ర. తెలుగుదేశం పార్టీ నాయకుడుగా, మంత్రిగా ఆయన చేసిన సేవలు మరువలేనివి. పరిటాల రవీంద్ర అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి అని తెలిపారు. వచ్చే ఏడాదిలో పెనుకొండలో పోరాటాల యోధుడు పరిటాల రవీంద్ర విగ్రహం ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించేతత్వాన్ని అలవాటు చేసుకుందాం

- మాజీ భారత క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు



విశాఖపట్నం, మహానాడు: ఏబీవీపీ కార్యకర్తలు అందరూ విద్యార్థి నాయకులు కాబట్టి తప్పులు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని భారత మాజీ స్టార్ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అన్నారు. విశాఖపట్నంలో శుక్రవారం ప్రారంభమైన ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడారు. విద్యార్థులకు కష్టపడటం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ ప్రారంభోత్సవ సభ కు మాజీ శాసన మండలి సభ్యుడు పీవీఎన్ మాధవ్ అధ్యక్షత వహించారు. తాను ఏబీవీపీ కార్యకర్తగా ఉన్నప్పటి రోజుల్ని గుర్తు చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా కాంటినెంటల్ కాఫీ సంస్థ అధినేత చల్ల రాజేంద్రప్రసాద్ పాల్గొని, మాట్లాడారు. గడిచిన కొంతకాలంగా భారతదేశ వ్యాపారవేత్తలకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు వస్తుందని అందుకని యువత ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా చక్కని వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఉద్యోగాలు సృష్టించే వ్యక్తులుగా గుర్తింపు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీరేంద్ర సోలంకే, రాష్ట్ర కార్యదర్శి యాగంటి గోపి, రఘు విద్యాసంస్థల అధినేత కలింది రఘు పాల్గొన్నారు.

**మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి 31వ వర్ధంతి సందర్భంగా గుంటూరు బ్రాడిపేటలోని షిర్డీ సాయి దినజన సేవాసమితి అంధుల, వికలాంగుల ఆశ్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బుర్ల రామాంజనేయులు, కోవెలముడి రవీంద్ర పండ్లు, మిఠాయి పంపిణీ చేశారు.**



## 27న ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

విశాఖపట్నం, మహానాడు: రీజినల్ టూరిజం ఇన్వెస్టర్స్ ఎంగేజ్మెంట్ పేరుతో ఈ నెల 27వ తేదీన విశాఖపట్నం వేదికగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు జరగనున్నట్టు జిల్లా పర్యాటక శాఖ అధికారిణి కె. జ్ఞానవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక నోవోటెల్ హొటల్లో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సదస్సు జరుగుతుందని, జాతీయ స్థాయిలోని దిగ్గజ కంపెనీల ప్రతినిధులు భాగస్వామ్యం కానున్నారని చెప్పారు.

పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించే నిమిత్తం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అడ్వెంచర్, క్రూయిజ్ టూరిజం, ఎకో టూరిజం, అరకు కాఫీ, 2024-29 న్యూ టూరిజం పాలసీపై చర్చ జరుగుతుందని, దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, అధికార ప్రతినిధులు చర్చిస్తారని తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, ఛైర్మన్, సీఎస్, పర్యాటక శాఖ ఎండీ, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, ఇతర అధికారులు భాగస్వామ్యం అవుతారని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

## గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యం

- సకల సౌకర్యాలు త్వరితగతిన కల్పన
- మంత్రి పార్థసారథి



నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సాధి అన్నారు. నరసరావుపేట మండలం ఉప్పలపాడు అర్బన హౌసింగ్ లే అవుట్ లో శుక్రవారం లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. జగనన్న కాలనీలను పీఎం ఏవై-ఎన్టీఆర్ కాలనీలుగా పేరు మార్చినట్టు తెలిపారు. మెయిన్ రోడ్డు నుండి కాలనీ వరకు విద్యుదీకరణ పనులు త్వరితగతిన చేపడుతున్నట్టు తెలిపారు. అదే విధంగా మార్చి మాసాంతానికి మరో 1500 ఇల్లు పూర్తిస్థాయిలో నిర్మిస్తామని తెలిపారు. రానున్న అయిదేళ్ళలో ప్రతి పేద వానికి గృహ వసతి కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పేదవానికి సొంత ఇంటి కల నిరవేర్చేలా పనులు చేపట్టాలని ముఖ్య మంత్రి సూచిం చారన్నారు.

2014-2019 కాలంలో గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.5 లక్షలు ఇవ్వగా వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 30 వేలు, కేంద్ర ప్రభుత్వం లక్షా యాభై వేల రూపాయలు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం రోడ్ల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు గృహ నిర్మాణ శాఖ నుండి నిధులు మంజూరు చేయడంతోపాటు కలెక్టర్ నిధులు జోడించి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, కలెక్టర్ పి.అరుణ్ బాబు, రెవెన్యూ డివిజినల్ అధికారి మాధవీ లత, గృహ నిర్మాణ శాఖ అధికారి వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అలసత్వానికి తావులేకుండా అభివృద్ధి

- జీవీ ఆంజనేయులు



వినుకొండ, మహానాడు: భారీ ఎత్తున చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలతో పట్టణం రూపురేఖలు మారబోతున్నాయని, సాధారణ పరిపాలన శాఖ నుంచి వచ్చిన రూ.కోటి 54 లక్షలు, రూ. 150 కోట్ల మంచినీటి పథకం పునరుద్ధరణతో పట్టణాన్ని ప్రగతిబాట పట్టించాలని అధికారులను ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశించారు. ఆలస్యం, అలసత్వానికి ఏ మాత్రం తావులేకుండా అభివృద్ధి పనులు శరవేగంగా జరిపి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ విభాగానికి సంబంధించి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్ విప్ జీవీ వినుకొండ మున్సిపల్ సాధారణ నిధులు నుంచి రూ. కోటీ 54 లక్షలతో 14 అభివృద్ధి పనులను మంజూరు చేసి టెండర్లు పిలవాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

ప్రతి కాలనీ చివరి వరకు విద్యుత్ స్తంభాలు వేసి బల్బులు అమర్చాలని ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట్ల బస్ షల్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణం నలు వైపులా నాలుగు బస్ షెల్టర్లు ఏర్పాటుకు పూర్తి ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు.

రూ.150 కోట్లతో మంచినీటి పథకం 2019లో గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే మంజూరు చేయిస్తే ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని వెంటనే కొత్త డీపీఆర్‌లు తయారు చేయించి టెండర్లు పిలవాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, డీఈ విష్ణుమూర్తి, శానిటరీ, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## అక్షయపాత్ర కిచెన్ సందర్శించిన నారా భువనేశ్వరి

మంగళగిరి: ఆత్మకూరు గ్రామంలోని అక్షయపాత్ర ఫౌండేషన్ యొక్క సెంట్రలైజడ్ కిచెన్ (కేంద్రీకృత వంటశాల) ను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం సందర్శించారు.

ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ, ప్రభుత్వ మధ్యాహ్న భోజనం ఎండిఎం పథకమైన "డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకం" ద్వారా 30,000 మంది పిల్లలకు ఇక్కడి నుండి దాదాపు 25 వాహనాలతో ఇన్సులేటెడ్ కంటైనర్లలో ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం అందిస్తుంది అన్నారు.అక్షయ పాత్ర ఫౌండేషన్ అనేది లాభాపేక్ష లేని సంస్థ, ఇది భారతదేశంలో మధ్యాహ్న భోజనం ద్వారా పిల్లల పోషకాహార లోపాన్ని పరిష్కరించడానికి కృషి చేస్తుంది.

ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ-సహాయక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం ద్వారా, అక్షయపాత్ర ఆకలిని పోగొట్టడం ప్రతిరోజు పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తుంది అన్నారు. ఇక్కడకు రావటం చాల సంతోషమగా ఉందన్నారు అలాగే శుక్రవారం వారు బియ్యం శుభ్రపరిచే యంత్రాన్ని ప్రారంభించారు. ఈ యంత్రం ద్వా రా బియ్యం నాణ్యత శుభ్రపరచే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది పిల్లలకు అత్యంత నాణ్యమైన ఆహారాన్ని పొందడానికి సహాయపడుతుంది.

ఈ సందర్భంగా అక్షయ పాత్ర మంగళగిరి ప్రెసిడెంట్ వంశీధర దాస మాట్లాడుతూ, ఆచార్యులు జగద్గురు శ్రీల ప్రభుపాదుల వారి ఆశయాలతో 1500 మందితో ప్రారంభమైన మధ్యాహ్న భోజన కార్యక్రమం ద్వారా అక్షయ పాత్ర ద్వారా దేశ వ్యాప్తంగా 13 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతంలోని దాదాపు 20,000 పైగా పాఠశాలల 24 లక్షల పైగా పిల్లలకు ప్రతిరోజు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తోంది.

నారా భువనేశ్వరి చాలామంది మహిళా పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిగా నిలిచారు, ఆమె ఈరోజు అక్షయపాత్రను సందర్శించి, రైస్ క్లీనింగ్ మెషీన్‌ను ప్రారంభించినందుకు ధన్యవాదాలు తేలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, విలాస విగ్రహ దాస, రఘునందన్ దాస, టిటిడి పాలక మండల సభ్యులు తమ్మిశెట్టి జానకి దేవి,మంగళగిరి నియోజక వర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి వింజమూరి ఆశాభాల, నియోజకవర్గ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, దుగ్గిరాల మండల టిడిపి అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత, మంగళగిరి పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఊట్ల దుర్గా మల్లేశ్వరి, మంగళగిరి మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, తాడేపల్లి మండల టిడిపి అధ్యక్షురాలు బోర్ర కృష్ణ వందన మరియు తెలుగుదేశం కార్యకర్తలు, అక్షయ పాత్ర సిబ్బంది పాల్గొన్నా రు.

## గాయపడిన చిన్నారికి సత్తిబాబురాజు ఆర్థిక సహాయం

కాకినాడ, మహానాడు: విద్యుత్తు 11 కేవీ తీగలు తగిలిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి కేతా లాస్యమాధురి, ఆమె తల్లి రమావతిలను రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోరుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వం నుంచి ఆర్థికంగా సహాయం అందేలా చూడడంతోపాటు గ్రామం నుంచి కూడా



తమ తోడ్పాటునందిస్తామని వారికి భరోసానిచ్చారు. ఈ సందర్భంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. సత్తిబాబురాజుతో పాటు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ, స్థానిక నాయకులు తోట నరసింహరావు, కాంద్రేగుల సత్యనారాయణ, కడలి అచ్యుతం, కడలి రామసత్యనారాయణ, బొంతు రెడ్డి, కాంద్రేగుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ, ఆటోనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో తెలుగు యువత ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. పరిటాల చిత్రపటానికి రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నూతలపాటి నాగభూషణం, ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు షేక్ నాగూర్ వలీలు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.



## ఎంపీ కేశినేనిను మర్యాదపూర్వకంగా కలిసిన ఎయిమ్స్ డైరెక్టర్ మాధబానంద కర్

విజయవాడ, మహానాడు: మంగళగిరి ఎయిమ్స్ పాలక మండలి సభ్యుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ను మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మాధబానంద్ కర్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధి పనులపై కాసేపు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) కల్నల్ శశికాంత్ తుమ్మ పాల్గొన్నారు.

## 50 శాతం సబ్సిడీతో ఫ్రూట్ కవర్స్

- ఎంపీకు కృతజ్ఞతలు తెలిపిన మామిడి రైతులు

విజయవాడ, మహానాడు: మైలవరం నియోజకవర్గం రెడ్డి గూడెం మండలం రెడ్డిగుంట మామిడి రైతులు ఎంపీ కేశినేని శివనాథ్ ను కలిసి ఫ్రూట్ కవర్స్ 50 శాతం సబ్సిడీతో లభించేలా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్



కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో శుక్రవారం రెడ్డి గూడెం రైతు ఉత్పత్తి దారుల సంఘం (ఎఫ్.పి.సి) డైరెక్టర్లు చేబ్రోలు శ్రీనివాసరావు, చేబ్రోలు రాజు ఆధ్వర్యంలో మామిడి రైతులు ఎంపీని కలిశారు.

ఎమ్.ఐ.డి.హెచ్ స్కీమ్ కింద 800 హెక్టార్లకు, ఒక్కో హెక్టార్ కు పదివేల చొప్పున ఫ్రూట్ కవర్స్ 50 శాతం సబ్సిడీతో అందుకున్నట్టు ఎంపీ కేశినేని శివనాథ్‌కు వివరించారు. ఫ్రూట్‌కవర్స్ తొడిగిన మామిడి కాయలను ఎంపీకు చూపించి వాటి నాణ్యత వివరించారు. నాణ్యత గల మామిడిలను పండిస్తున్నందుకు మామిడి రైతుల తరుపున ఎఫ్.పి.సి డైరెక్టర్ చేబ్రోలు శ్రీనివాసరావు ను ఎంపీ శాలువాతో సత్కరించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘం సభ్యుల అభివృద్ధికి ఎప్పుడు అండగా వుంటానని ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎఫ్.పి.సి డైరెక్టర్ చేబ్రోలు కృపారాజు, మామిడి రైతులు చేబ్రోలు రాజు, చేబ్రోలు సాంబశివరావు, నాగ ప్రసాద్, హార్టికల్చరల్ అధికారి నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 25, జనవరి 2025 ||





దావోస్ పర్యటన విజయవంతంగా ముగించుకుని భారీ పెట్టుబడులతో హైదరాబాద్‌కు తిరిగివచ్చిన నేపథ్యంలో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అభినందించిన ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతిరెడ్డి, ప్రేమ్ సాగర్ రావు.

# మెడికల్ కాలేజీలపై వైసీపీ నిర్లక్ష్యం!

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, మహానాడు:** రెవెన్యూ సదస్సులతో సమస్యలు తగ్గుతున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ ని పొడిగించడం ద్వారా పలు లాభాలు కలుగుతున్నాయి.. కేన్సర్ పరీక్షలు నిర్వహించడం, వ్యాధుల గురించి చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇక్కడి భారతీయ జనతా పార్టీ(బీజేపీ) రాష్ట్ర కార్యాయలంలో శుక్రవారం నిర్వహించిన వారధి కార్యక్రమంలో ఆయన పాల్గొని, పలు ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన ఏమన్నారంటే...

అన్ని స్థాయిల్లోని పద్ధతి ప్రకారం అన్ని పదవుల నిర్ణయం ఉంటుంది. అధికారంలో భాగస్వామ్యం ఉంది కనుక ప్రజల సమస్యలు తీర్చడంలో ముందున్నాం. సూర్యఘర్ ద్వారా ప్రతీ ఇంటికి ఆదాయ వనరుగా మార్చే పనులు చేస్తున్నాం. నిత్యం ప్రజలలోకి వెళ్ళాలి... 2030 నాటికి 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం. పీపీపీ మోడ్ లో మెడికల్ కాలేజీలు తేవాల్సిన పరిస్థితికి గత ప్రభుత్వం కారణం. 800 కోట్లు మాత్రమే మెడికల్ కాలేజీలకి ఖర్చు పెట్టింది గత ప్రభుత్వం. నిధులు సరిగా ఇవ్వకుండా కాలేజీల నిర్మాణం జరగకపోవడానికి



గత ప్రభుత్వం కారణం. సిద్దార్ధ మెడికల్ కాలేజీలో విద్యార్ధినుల హాస్టల్ లేదు. పీ4 మోడల్‌లో మెడికల్ కాలేజీలు వచ్చిన దానికి తగిన ఫ్రీ సీట్లు ఉంటాయి.

### వినతుల వెల్లువ

గుంటూరు జిల్లా నుంచి జొన్నలగడ్డ మహేశ్వరీ అనే మహిళ ఆస్తిని జమ్ముల శ్రీను అనే వ్యక్తి కబ్జా చేసి బెదిరింపులకు గురి చేసినట్టు బాధితురాలు మంత్రి సత్య కుమార్ యాదవ్‌కి వివరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు స్పందించలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. మంత్రి గుంటూరు జిల్లా ఎస్పీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నరాలు చచ్చు పడిన పిల్లలకి సరైన వైద్య సదుపాయం కలిపించాలని అమరావతి రేర్ డిసిస్ ఆర్గనైజేషన్ వారు మంత్రి కి వినతి పత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 400 వందల మంది పిల్లలు నరాలు చచ్చు పడే వ్యాధి తో బాధపడుతున్నారని ఈ వ్యాధి నిర్దారణ కొరకు ఎయిమ్స్ లో పరీక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ వ్యాధి నిర్దారణ కొరకు హైదరాబాద్ నిమ్స్ హాస్పటల్ కి వెళ్లాల్సి వస్తుందని, ఈ దృష్ట్యా ఎయిమ్స్ లో ఇలాంటి పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేబినేట్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. యునైటెడ్ మినరల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారు మైనింగ్ సమస్య ను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీ శర్మ, వారధి సమన్వయ కర్త కిలారు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి దామోదర రాజీనామా చేయాల్సిందే

- రుణమాఫీ విషయంలో నిజాలు ఒప్పుకున్న దామోదర
- అర్హులైన వారికి కాకుండా కాంగ్రెస్ నాయకులకే పథకాలు ఇస్తే అధికారులను సైతం వదలం
- ఆందోల్ మాజీ ఎం ఎల్ ఏ క్రాంతి కిరణ్

**ఆందోల్:** రుణమాఫీ విషయంలో ప్రజల ఒత్తిడికి తలొగ్గే ఆరోగ్య శాఖ మంత్రి దామోద రాజనరసింహ వాస్తవాలు అంగీకరించారని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. రుణమాఫీ అందరికి జరగలేదని కొన్ని నెలలుగా మా పార్టీ నాయకులు కేటీఆర్, హరీష్ రావుతో పాటు మేమేందరం కూడా చెబుతున్నా వస్తున్నాం. ప్రజలు సైతం గగ్గోలు పెడుతున్నారు. కానీ ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయంటూ మాపై ప్రతిదాడికి పూనుకుని అందరిని దబాయిస్తూ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి తో పాటు అందరూ మంత్రులు అబద్దాలతో ప్రజలను నమ్మించారని అన్నారు.

అయితే గత సంవత్సర కాలంగా అందరం చెబుతున్నట్టే మంత్రి వాస్తవాన్ని ఇప్పటికైనా అంగీకరించారు కాబట్టి ..అబద్దాలతో ఈ ప్రభుత్వాన్ని నడుపుతున్న వారికి బుద్ధి చెప్పాలంటే మంత్రి దామోదర్ రాజనర్సింహ రాజీనామా చేసి ప్రజల్లోకి రావాలని ఆయన డిమాండ్ చేశారు. నియోజకవర్గ సీనియర్ నాయకులతో కలిసి ఆందోల్‌లో ఆయన ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ.... ఆరు గ్యారంటీలు అమలు అవుతాయేమోనని రుణమాఫీ ఎన్నికల అనంతరం అయినా పూర్తి అవుతుందేమో అని నమ్మి మీ పార్లమెంట్ సభ్యుడికి కూడా ప్రజలు ఓటేశారు. అయినా కూడా మీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచించింది.

గత కొన్నిరోజులుగా ఆందోల్ నియోజకవర్గంలో జరుగుతున్న గ్రామసభలు అన్నీ కూడా ప్రజలతో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ సభలుగానే జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. లబ్ధిదారుల లిస్టు అంటూ తెల్ల కాగితం తీసుకొచ్చి వినిపించి గ్రామ సభలో ఫైనల్ చేస్తున్నామంటూ చాలా గ్రామాల్లో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

ఎవరైతే ఇప్పటివరకు లబ్ధి పొందలేక అర్హులై ఉన్నారో వారికి మాత్రమే పథకాలు అందే విధంగా అధికారులు ప్రయత్నం చేయకపోతే తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని ఆయన హెచ్చరించారు. ప్రజల ఆకాంక్ష లు ఆవేదనను అర్థం చేసుకోకుండా పేద ప్రజలకు ద్రోహం చేయడంలో భాగస్వాములైతే అధికారులను కూడా ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు.

నిజాయితీగా నిష్పక్షపాతంగా పాలన అందిస్తామని రాజ్యాం



గాన్ని చేతబట్టి తిరిగిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఎటువంటి హోదా లేకపోయినా కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులకే పెద్ద పీట వేసి కూర్చోబెట్టి వారితోనే లబ్ధిదారుల లిస్టు ఎలా తయారు చేస్తారని ఆయన ప్రశ్నించారు.

ఈ సమావేశం లో డి సి సి బి మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి, మాజీ ఎం పి పి రామాగౌడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగభూషణం ఆందోల్, మునిపల్లి మండల పార్టీ అధ్యక్షులు లక్షికాంత్ రెడ్డి, విజయ్ కుమార్, చాపల వెంకన్న, మండల యుత్ అధ్యక్షుడు అనిల్ రెడ్డి, సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, వీరేశం షెట్, మొగులయ్య, సత్యం, మహేష్, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

# కడప రవాణా శాఖలో కీచక అధికారిపై వేటు!

- విచారణకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశం

**కడప:** కడప రవాణా శాఖలో కీచక అధికారిపై వేటు పడింది. ఈ మేరకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత మహిళలకు అండగా ఉంటామన్నారు. రవాణా శాఖకు కీర్తి తెచ్చేలా విధులు నిర్వహించాలని ఉద్యోగులకు మంత్రి హితవు పలికారు.

ఉన్నత అధికారై ఉండి అసభ్య కార్యకలాపాలకు పాల్పడుతూ మహిళా ఉద్యోగుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడటంపై రవాణా శాఖ మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆ ఉన్నత అధికారిని తక్షణమే విధుల నుండి తొలగించి కేంద్ర కార్యాలయానికీ సరెండర్ చేశామని, ఒక సీనియర్ అధికారి ద్వారా సమగ్ర విచారణ తక్షణమే చేపట్టి శాఖపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని మంత్రి మీడియాకు తెలిపారు. సీఎం



చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ఇటువంటి సంఘటనలను ఉపేక్షించదని హెచ్చరించారు.

# పవన్‌కళ్యాణ్ సమాధానం చెప్పాలి

- ఇంకొన్నాళ్లు ఆగితే ప్రజలకు మిగిలేది శూన్యం
- మెడికల్ కాలేజీలు, పోర్టులు, రోడ్లు.. అన్నీ ప్రైవేటుకేనా?
- ఇదేనా చంద్రబాబు చెప్పిన సంపద సృష్టించే విధానం?
- చంద్రబాబు వల్ల రెండేళ్లలో 2450 మెడికల్ సీట్లు లాస్
- ఇప్పుడు 'సేఫ్ క్లోజ్' పేరుతో మెడికల్ కాలేజీలకు తాళాలు
- మెడికల్ సీట్లపై పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలి
- పార్టీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



**తాడేపల్లి:** ప్రైవేటీకరణ మీద మమకారంతో పీ-4 పేరుతో చంద్రబాబు అనుసరిస్తున్న విధానాల కారణంగా రాష్ట్రం 2450 మెడికల్ సీట్లు కోల్పోయిందని, మెడిసిన్ చదవాలన్న పేద విద్యార్థుల కలలు కల్లలయ్యాయని వైయస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆక్షేపించారు. ఏ సీఎం అయినా, రాష్ట్రంలో కొత్తగా మెడికల్ సీట్లు రావాలని ఆరాటపడతారు. కానీ, ఆ సీట్లు వద్దనే ప్రభుత్వం ఏపీలో ఉండటం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం అని ఆయన అన్నారు. 'సేఫ్ క్లోజ్ పేరుతో కూటమి ప్రభుత్వ మూసేసిన మెడికల్ కాలేజీలను త్వరలోనే వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో సందర్శించి వాటి నిర్మాణ నైపుణ్యం, స్థితిని మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పారు. చంద్రబాబు హామీలకు గ్యారెంటీ అని ఎన్నికలకు ముందు ప్రకటించిన పవన్‌కళ్యాణ్.. ఇప్పుడు ఈ ప్రైవేటీకరణ పరంపరపై ప్రజలకు ఏం సమాధానం చెబుతారని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం లోనూ ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న ఉద్దేశంతో నాటి సీఎం వైఎస్ జగన్ మొత్తం 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు సాధించడంతో పాటు 5 కాలేజీలు పూర్తి చేసి బోధన ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అయ్యాక వైఎస్ జగన్ మహోన్నత లక్ష్యంతో నాడు ప్రారంభించిన మెడికల్ కాలేజీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వైఎస్ జగన్ ప్రారంభించిన 5 మెడికల్ కాలేజీలను మినహాయించి (పాడేరు 50 సీట్లు) మిగతా వాటిని సేఫ్ క్లోజ్ చేసి వాటిని ప్రైవేట్‌కు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించి జీవో ఇచ్చింది. ఏపీఎంఎస్ఐడీసీ దీనికి చైర్మన్‌గా ఉంటారని పేర్కొన్నారు.

దాదాపు 15 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు, తన హయాంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటు చేయలేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వాములై ఉండి కూడా రాష్ట్రానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తీసుకురావాలన్న ఆలోచన చంద్రబాబు చేయలేదు. మరోవైపు ప్రైవేటు కాలేజీల విషయంలో మాత్రం చంద్రబాబుకు అమితాసక్తి. చంద్రబాబు పాలనలో మొత్తం 18 ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు అనుమతులొస్తే అందులో 12 కాలేజీలకు చంద్రబాబే అనుమతులిచ్చారు.

చంద్రబాబు కారణంగా రాష్ట్రం ఇప్పటికే 700 మెడికల్ సీట్లు కోల్పోయింది. ఇవేకాకుండా 2025-26కి సంబంధించి మొదలు కావాల్సిన 7 మెడికల్ కాలేజీలను పూర్తి చేసి ఉంటే మరో 1,050 సీట్లు రాష్ట్రానికి కలిసొచ్చేవి. చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం మొత్తంగా 2,450 మెడికల్ సీట్లు కోల్పోవాల్సి వచ్చింది.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్ ఎక్కడి మీటింగ్ పెట్టినా సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో సీట్లు అమ్ముకుంటున్నారని అబద్దాలతో నానా యాగీ చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక ఏకంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రైవేటుకు తాకట్టు పెట్టి డాక్టర్ కావాలన్న ఆశలపై నీళ్లు చల్లేలా 2,450 మెడికల్‌సీట్లను రాకుండా అడ్డుకున్నాడు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చే ప్రతి హామీకి నేను గ్యారెంటీ అని ప్రకటించిన పవన్‌కళ్యాణ్.. కోల్పోయిన మెడికల్ కాలేజీ సీట్లపై ప్రజలకు, విద్యార్థులకు ఏం సమాధానం చెబుతారు. పోర్టులు, హార్బర్లు, మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడం, గ్రామీణ రోడ్లపై టోల్ గేట్లు పెట్టి టోల్ వసూలు చేయడం కూడా సంపద సృష్టిం చడం అంటారా? ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ ప్రైవేటుకి ఇవ్వడం ప్రపంచంలో ఎక్కడైనా జరిగిందా?. ఇది విజనరీ నిర్ణయం అని చెప్పుకోవడం కన్నా దౌర్భాగ్యం ఉందా?




# కోడి కత్తి కేసు ఫిబ్రవరి 21కి వాయిదా!

- హాజరు కాని మాజీ సీఎం జగన్
- కోర్టు ధిక్కారంగా పరిగణించాలి: విదసం డిమాండ్

**విశాఖపట్నం, మహానాడు:** ఐదేళ్ళ నాటి సంచలన కోడి కత్తి కేసు విచారణలో మళ్ళీ వాయిదా పడింది.. ఎన్ఐఎ కోర్టులో కోడి కత్తి కేసు శుక్రవారం విచారణకు రాగా బెయిల్ మీద ఉన్న నిందితుడు జనపల్లి శ్రీనివాస్ తన న్యాయవాది అబ్దుల్ సలీంతో కలిసి కోర్టుకు హాజరయ్యాడు. ఫిర్యాదుదారు, బాధితుడు మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి కోర్టుకు హాజరు కాకపోవడంతో కేసు వచ్చే నెల 21కి వాయిదా వేసినట్టు న్యాయవాది సలీం తెలిపారు.

### కోర్టు ధిక్కారంగా పరిగణించాలి విదసం

కోడికత్తి కేసులో నిదితుడు శ్రీనివాస్ కు బెయిల్ మంజూరు అయి సంవత్సరం కావస్తుందని, మూడేళ్లుగా సాక్ష్యం చెప్పడానికి జగన్ మోహన్ రెడ్డి రాక పోవడం వల్ల కేసు ముందుకు కదలడం లేదని విదసం ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా వందల సార్లు కోర్టు వాయిదాకు హాజరుకానివారిని కోర్టు ధిక్కరణ గా పరిగణించాలని విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు డిమాండ్ చేశారు.

# సాయిరెడ్డి.. నిన్ను వదిలేస్తాం అనుకుంటున్నావా?

- నీకు శిక్ష పడే వరకు నిన్ను వదిలే సమస్యే లేదు
- విజయ్ సాయి రెడ్డిపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ సంచలన వ్యాఖ్యలు.



**విశాఖ:** కష్టం నీదాక వస్తే నాకు ఎవ్వరితో వ్యక్తిగతంగా విబేధాలు లేవు, రాజకీయాల నుంచి తప్పుకుంటున్నా అంటే నిన్ను వదిలేస్తాం అనుకుంటున్నావా.? సైరా పంచ్ అంటూ నువ్వు వేసిన తప్పుడు ట్వీట్స్, కూసిన తప్పుడు కూతలు మర్చిపోతాం అనుకుంటున్నావా.? ఉత్తరాంధ్రలో ఎంతో మందిని బెదిరించి రాయించుకున్న ఆస్తులు, నువ్వు చేసిన దోపిడి, అరాచకాలు ఇలా ప్రతి ఒక్క తప్పుడు పనికి నీకు శిక్ష పడే వరకు నిన్ను వదిలే సమస్యే లేదు.



తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో పరిటాల రవీంద్ర వర్ధంతి శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శాసన మండలి సభ్యుడు పరుచూరి అశోక్ బాబు, పార్టీ నాయకులు నన్నపనేని రాజకుమారి, దేవేంద్రప్ప, బొద్దులూరు వెంకటేశ్వరరావు, ఏవీ రమణ, బుచ్చి రాంప్రసాద్, రవి యాదవ్, పరుచూరి కృష్ణ, హాసన్ భాష, గంటా గౌతం, పిరయ్య, పార్టీ మీడియా కో ఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోవూరు నియోజకవర్గం, కొడవలూరు మండల కేంద్రంలో మాజీ మంత్రి నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి , ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి



దావోస్ పర్యటన ముగించుకొని ఉండవల్లి నివాసానికి చేరుకున్న అనంతరం అందుబాటులో ఉన్న పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో దావోస్ అనుభవాలు పంచుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

# పేద విద్యార్థుల భవిష్యత్తుకు కృషి

- బాలికల జాతీయ దినోత్సవ సందర్భంగా పేద విద్యార్థినికి ఆర్థికసాయం అందించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం:** గొల్ల చెరువు గ్రామ నివాసిని సూరముడి రిషిత చదువుకు ఆమె తండ్రి పిన్నిల సహాయ సహకారాలు అందించకపోవడంతో ఆ అమ్మాయి చదువుకు దూరం అవుతుందని స్థానిక నాయకులు మంత్రి సుభాష్ దృష్టికి



తీసుకురాగా మంత్రి వెంటనే స్పందించి ఆ విద్యార్థినికి చదువుకయ్య ఖర్చులను నేను చూసుకుంటానని , వెంటనే విద్యార్థిని వి ఎస్ ఎం కాలేజీలో హాస్టల్‌లో చేరుస్తానని హామీ ఇవ్వడం జరిగింది. తక్షణ సాయం కింద 10వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు.

# మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుని పరామర్శించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

**సికింద్రాబాద్:** ఉత్తరాఖండ్ పర్యటనలో అస్వస్థకు గురైన గుండెకు శాస్త్ర చికిత్స అనంతరం హైదరాబాద్‌లో మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ని వారి నివాసంలో పరామర్శించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు . ఈ సందర్భంగా వారి ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ బాలమల్లు , కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శనివారం 25, జనవరి 2025 ||





## గురువుని మెప్పించిన శిష్యుడు...?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 16వ చిత్రం బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా చిత్రం ఉండబోతుందని ప్రచారంలో ఉంది. రామ్ చరణ్ పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇప్పటికే రెండు షెడ్యూళ్ల షూటింగ్ పూర్తయింది. తాజాగా ఈ రెండు షెడ్యూళ్ల రా పుటేజ్ ను బుచ్చిబాబు గురువు సుకుమార్ చూసి థ్రిల్ అయ్యారుట. రెండు షెడ్యూళ్లలో థ్రిల్లింగ్ అంశాలు ప్రేక్షకుల్ని ఎగ్జైట్ మెంట్ కు గురి చేసేలా ఉన్నాయని కితాబిచ్చారుట. బుచ్చిబాబు పనితనాన్ని ప్రశంసించారుట. రెండు షెడ్యూళ్లతోనే ఈ రేంజ్‌లో మెప్పించాడంటే? బుచ్చిబాబు స్టోరీని ఎంత బలంగా రాసుకున్నాడో అద్దం పడుతుంది. ఈనెల 27 నుంచి మూడవ షెడ్యూల్ మొదలవుతుంది. ఈ షెడ్యూల్ హైదరాబాద్ లో నే ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికే సినిమాకి అవసరమైన సెట్స్ కొన్నింటిని రామోజీ ఫిలింసిటీ సహా హైదరాబాద్ శివార్లలో నిర్మించారు. తదుపరి షెడ్యూల్ అక్కడే ప్రారంభిస్తారని తెలుస్తోంది. ఇందులో చరణ్‌కి జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోంది. రెండు షెడ్యూళ్ల షూటింగ్‌లో చరణ్‌తో పాటు జాన్వీ కూడా పాల్గొంది. మరి మూడవ షెడ్యూల్‌లో జాన్వీ భాగమవుతుందా? లేదా? అన్నది చూడాలి.



### పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో
## ‘వెంకటలచ్చిమి’

‘ఆర్‌ఎక్స్ 100’ సినిమాతో యూత్ గుండెల్లో సెగలురేపి, ‘మంగళవారం’ మూవీతో మనసు దోచుకున్న బ్యూటీ పాయల్ రాజ్‌పుత్.. ఈసారి పాన్ ఇండియా సినిమాతో రాబోతోంది. 6 భాషల్లో ‘వెంకటలచ్చిమి’గా ఎంట్రీ ఇవ్వబోతోంది.

రాజా, ఎన్ఎస్ చౌదరి నిర్మాతలుగా, డైరెక్టర్ ముని దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న ‘వెంకటలచ్చిమి’ మూవీ హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా డైరెక్టర్ ముని మాట్లాడుతూ.. “వెంకటలచ్చిమి’గా కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిగ్గా సరిపోతారనిపించింది. పాన్ ఇండియా సినిమాగా తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, కన్నడ, మలయాళం, తమిళం భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ట్రైబల్ గర్ల్ యాక్షన్ రివెంజ్ స్టోరీతో కూడిన ఈ రివేంజ్ డ్రామా ఇండియన్ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించడం ఖాయం” అని అన్నారు. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ.. “మంగళవారం’ సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నాను. నచ్చక రిజెక్ట్ చేశాను. డైరెక్టర్ ముని ‘వెంకటలచ్చిమి’ కథ చెప్పగానే చాలా నచ్చేసింది. ఈ సినిమా తర్వాత నా పేరు ‘వెంకటలచ్చిమి’గా స్థిరపడిపోతుందేమో అన్నంతగా బలమైన సబ్జెక్టు ఇది. నా కెరీర్‌కి నెక్స్ట్ లెవల్‌గా ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నిలిచిపోతుందనే నమ్మకం ఉంది” అని అన్నారు.

## ‘8 వసంతాలు’ హార్ట్ వార్మింగ్ టీజర్ 1

మోస్ట్ సక్సెస్ ఫుల్ పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ బిగ్ స్టార్లతో హై-బడ్జెట్ ఎంటర్‌టైనర్‌లను నిర్మించడమే కాకుండా కంటెంట్-రిచ్ మూవీలను రూపొందిస్తోంది. ఇంటర్నేషనల్ అవార్డులు గెలుచుకుని విమర్శకుల ప్రశంసలు పొంది ‘మను’తో దర్శకుడిగా డెబ్యు చేసి దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టితో కాన్సెప్ట్ బేస్డ్ మూవీ ‘8 వసంతాలు’ను నిర్మిస్తున్నారు. MAD ఫేమ్ అనంతిక సనీల్‌కుమార్ ఈ మూవీలో హీరోయన్. ఇందులో ఆమె శుద్ధి అయోధ్య పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్‌తో ఇప్పటికే మంచి క్రియేట్ చేసింది. కొత్తగా విడుదలైన టీజర్ విడిపోవడం వల్ల కలిగే బాధలతో వున్న కన్న పసునూరిని అవంతిక ఓదార్చడంతో ప్రారంభమవుతుంది. అతని దుఃఖం లోతును ఆమె అర్థం చేసుకోలేదని చెప్పడంతో హను రెడ్డితో తన ఫస్ట్ లవ్ ని రివిల్ చేస్తోంది. “ఎవరి తుపాన్ లు వారికి వుంటాయి లోపల. కొందరు బయట పడతారు, ఇంకొందరు ఎప్పటికీ పడరు’ ఈ డైలాగ్ క్యారెక్టర్స్ బ్యాక్ డ్రాప్ ని ఎమోషనల్ గా ప్రజెంట్ చేసింది. ఫణీంద్ర నర్సెట్టి రైటింగ్ కథనంలో పొయిటిక్ టచ్, రివర్స్ ఫ్లాష్‌బ్యాక్‌తో చేయడం టీజర్‌కు డెప్త్ యాడ్ చేసింది.





## ఏప్రిల్ 10న “జాట్”

బాలీవుడ్ లెజెండ్ సన్నీ డియోల్, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని మోస్ట్ ఎవైటెడ్ మూవీ “జాట్” విడుదలకు సిద్ధమవుతోంది. ప్రతిష్టాత్మక మైత్రి మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై డైనమిక్ ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 10, 2025న థియేటర్లలో విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో సన్నీ డియోల్ ఇంటెన్స్ యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. భుజంపై భారీ తుపాకీతో ఫెరోషియస్‌గా ముందుకు సాగుతున్నాడు. బ్యాక్ డ్రాప్ లో హెలికాప్టర్, కరెన్సీ నోట్లు గాలిలో ఎగురుతున్నాయి. స్టైల్, స్వాగర్‌ను ప్రజెంట్ చేసిన సన్నీ డియోల్ లుక్ అదిరిపోయింది, ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన రికార్డు స్థాయి టీజర్ విడుదల తర్వాత రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ తో ఫ్యాన్స్ లోసందడి నెలకొంది. పుష్ప 2తో పాటు ప్రపంచవ్యాప్తంగా 12,500 స్క్రీన్లలో ప్రదర్శించబడిన ఈ టీజర్, ఈ సంవత్సరంలో మోస్ట్ బ్లాస్ట్ యాక్షన్ డ్రామాగా నిలిచే స్టేజ్ ని సెట్ చేసింది. ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామి ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. “జాట్” చిత్రానికి సంగీతం థమన్ ఎస్, రిషి పంజాబీ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు.



## అఖండ 2: తాండవం
### - సంయుక్త ఆన్ బోర్డ్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను హైలీ యాంటిసిపేటెడ్ ‘అఖండ 2: తాండవం’ కోసం నాల్గవ సారి కొలాబరేట్ అయ్యారు. వారి మునుపటి బ్లాక్ బస్టర్ అఖండకు ఈ సీక్వెల్ యాక్షన్, ఇంటెన్స్ నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లనుంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట




నిర్మించిన ఈ చిత్రాన్ని ఎం తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు. వెరీ ట్యాలెంటెడ్ సంయుక్త ఈ చిత్రంలో ఫీమేల్ లీడ్ గా ఎంపికయ్యారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న సంయుక్త కొన్ని హై-ప్రొఫైల్ ప్రాజెక్టులలో నటిస్తున్నారు. తన హీరోయిన్స్‌ని అద్భుతమైన పాత్రల్లో చూపించే బోయపాటి శ్రీను, సంయుక్తను చాలా క్రూషియల్ క్యారెక్టర్‌లో చూపించనున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. సీక్వెల్‌ను భారీ బడ్జెట్‌తో బిగ్ కాన్వాస్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు.



### తండేల్ సాంగ్
## హైలెస్సో హైలెస్సా

యువ సామ్రాట్ నాగ చైతన్య మోస్ట్ ఎవైటెడ్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘తండేల్’. చందూ మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మించారు. మొదటి రెండు పాటలు బుజ్జి తల్లి, నమో నమః శివాయ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన తర్వాత మేకర్స్ రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ స్వరపరిచిన థర్డ్ సింగిల్ హైలెస్సో హైలెస్సాను విడుదల చేశారు. హైలెస్సో హైలెస్సా సాంగ్ లాంగ్ డిస్టెన్స్ రిలేషన్స్ షిప్ ని, ఎదురుచూపులని, నాగ చైతన్య, సాయి పల్లవి మధ్య ఉన్న అనురాగాన్ని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది వండర్ ఫుల్ మోలోడీస్ ని కంపోజ్ చేయడంలో మాస్టర్ అయిన రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్, హృదయాన్ని తాకే మరొక లవ్ మెలోడీని కంపోజ్ చేశారు. శ్రేయ ఘోషల్, నకాష్ అజీజ్ వోకల్స్ మెలోడీని మరింత ఎలివేట్ చేశాయి. శ్రీమణి లిరిక్స్ విడదీయరాని ప్రేమని చాలా గొప్ప ప్రెజంట్ చేశాయి.

Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144